
వెంకన్న హుండీకి మరో టోకరా


తిరుపతి టౌన్ బ్యాంకులో రూ.10కోట్లు డిపాజిట్ చేసిన టీటీడీ



శ్రీవారి నిధులను ఇష్టారాజ్యంగా వాడేస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో డిపాజిట్ల రూపంలో మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తిరుపతి కోఆపరేటివ్ టౌన్ బ్యాంకులో రూ.10 కోట్లను గుట్టుచప్పుడుకాకుండా టీటీడీ డిపాజిట్ చేసింది.రెండు రోజుల క్రితం టీటీడీ ఖజానా నుంచి 13నెలలకు తిరుపతి టౌన్ బ్యాంకుకు నిధులు డిపాజిట్ చేసినట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది. దీనికి సంబంధించిన డిపాజిట్ బాండ్లను కూడా టీటీడీకి టౌన్‌బ్యాంకు అందజేసినట్టు సమాచారం. టీటీడీ నియమ నిబంధనల మేరకు మిగులు మొత్తాలను ఎక్కువ వడ్డీ ఇచ్చే జాతీయ బ్యాంకులో మాత్రమే డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆమోదించిన ప్రైవేట్ రంగ బ్యాంకులు కొటేషన్లు సమర్పించే అర్హత పొందడానికి అత్యధిక క్రెడిట్ రేటింగ్ కలిగివుండాలి. కేంద్ర ప్రభుత్వ లేదా రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టకూడదని టీటీడీ పాలకమండలి ఇదివరకే తీర్మానించింది. 2022లో టీటీడీ విడుదలచేసిన శ్వేతపత్రం మేరకు దాదాపు రూ.1600 కోట్లు నగదు రూపంలో వివిధ జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో వున్నాయి. డిపాజిట్ చేయదలుచుకున్న జాతీయ బ్యాంకు ఎంత వడ్డీ ఇస్తుందో తెలియజేస్తూ సీల్డు కవర్‌లో కొటేషన్ పంపాలి. టీటీడీ ట్రస్టు అనుమతితో అధిక వడ్డీ ఇచ్చే జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తుంటారు. టీటీడీ ఇప్పటివరకు ఎస్బీఐ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, విజయ బ్యాంకు, ఆంధ్రా బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి బ్యాంకుల్లో డిపాజిట్ చేసినట్టు తెలిసింది. అయితే పాలకమండలి ముఖ్యనేత నోటి మాట చెప్పారని రూ.10కోట్లు ఒక్క క్లిక్‌తో టౌన్‌బ్యాంకులో డిపాజిట్ చేసేశారు. రూ50 కోట్లు అడిగితే తొలివిడతగా 8.5 శాతం వడ్డీ రేటుతో రూ.10కోట్లు జమచేశారు. ఇప్పటివరకు సహకార బ్యాంకుల్లో శ్రీవారి నిధులు డిపాజిట్ చేసిన దాఖలాల్లేవు. ఎన్నికలవేళ నగరంలో మహిళలకు భారీగా రుణాలు ఇచ్చేందుకే ఈ నిధులు వినియోగిస్తారని ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ఏడాది కాబట్టి రుణగ్రహీతలు తిరిగి చెల్లించకపోతే టౌన్‌బ్యాంకుపై భారం పడకతప్పదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టౌన్‌బ్యాంకు భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. కొత్త పాలకమండలి వచ్చిన తర్వాత దాదాపు రూ.15కోట్లు డిపాజిట్‌దారులు వెనక్కి తీసుకున్నట్టు సమాచారం.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

ఖర్చుకు సిద్ధమా...?



'అహ నా పెళ్లంట సినిమాలో బ్రహ్మానందంలా ఉంది మా పరిస్థితి' అంటూ వాపోతున్నారు నగరి నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు. సీఎం జగన్ అనంతపురంలో నిర్వహించనున్న సిద్ధం సభకు తరలించాల్సిన జనసంఖ్య నియోజకవర్గాలవారీగా ఖరారైంది. 5నుంచి 10వేల మందిని నగరి నుంచి తరలించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మంగళవారం నగరిలో వైసీపీ నాయకులతో మంత్రి రోజా నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఒక్కో స్థానిక నాయకుడు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధి కనీసం 50 మందిని అనంతపురం సభకు తరలించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. సభకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం మాత్రం పార్టీ ఏర్పాటు చేస్తుందని, సభకు వచ్చే వారికి అయ్యే ఖర్చులు ఆయా నాయకులే భరించుకోవాలని తేల్చి చెప్పేశారు.ఈ మాట వినగానే నాయకులు ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. 'అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తవుతోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పెట్టిన ఖర్చులకు కనీసం వడ్డీకి సరిపడా కూడా సంపాదించుకోలేకపోయా' అని ఒక నాయకుడు వాపోయాడు. 'సరేలే భలే చెప్పావులే అన్నా.... కౌన్సిలర్ ఎలక్షన్లలో రూ.20 లక్షలు ఖర్చయింది. కనీసం వార్డులో డ్రైనేజీ నిర్మించే పని కూడా చేసుకోలేకపోయాను' అంటూ మరో కౌన్సిలర్ కం నాయకుడు నిట్టూర్చాడు. 'ఎక్కడో అనంతపురానికి అధినేత వస్తే మనం ఖర్చులు భరించి, జనాన్ని తీసుకువెళ్లడం ఏమిటి? పెద్ద నాయకుల పుట్టినరోజులు వస్తే వార్డుల్లో, గ్రామాల్లో వేలకు వేలు ఖర్చులు పెట్టి ఫ్లెక్సీలు కట్టాలి... నియోజకవర్గంలో మీటింగ్ అంటే జనాన్ని తోలాలి... పల్లెనిద్ర, గడప గడపకు అంటే రూ.లక్షలు ఖర్చు. ఎందుకు జగనే కావాలి అనే కార్యక్రమానికైతే చేతి చమురు వదిలింది. వడ్డీలు కట్టుకోవడం తప్ప రూపాయి సంపాదన లేదు.' అని చేతి చిల్లు వదిలిన మరొకరు భోరుమన్నారు. మంత్రి ముందు నోరెత్తకపోయినా ఒకరికొకరు మాత్రం తమ కష్టాలు కడుపుచించుకుని పంచుకున్నారు.

-పుత్తూరు అర్బన్

కదిలొచ్చిన జనం



సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

- ఎండను లెక్కచేయని వైనం
- గంటపాటు సాగిన చంద్రబాబు ప్రసంగం
- ఆసక్తిగా విన్న సభికులు
- వైసీపీ నేతల అవినీతిని ప్రస్తావించగానే కేకలతో స్పందన
- జీడీనెల్లూరులో 'రా కదలిరా' విజయవంతం

చిత్తూరు, ఆంధ్రజ్యోతి

'రా.. కదలిరా' అన్న టీడీపీ పిలుపునకు జనం స్పందించారు. చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు సమీపం రామానాయుడుపల్లె వద్ద మంగళవారం నిర్వహించిన చంద్రబాబు సభకు కదిలొచ్చారు. జిల్లా నలుమూలల నుంచీ టీడీపీ శ్రేణులూ తరలివచ్చారు. షెడ్యూల్ మేరకు మధ్యాహ్నం 3 గంటలకు చంద్రబాబు వస్తారని తెలిసినా ఉదయం 9 గంటల నుంచే సభా ప్రాంగణం నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారింది. 12 గంటలకంతా కార్యకర్తలు, మహిళలు, జనం పెద్దఎత్తున చేరుకున్నారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ లెక్కచేయలేదు. షెడ్యూల్ మేరకు చంద్రబాబు సభాప్రాంగణం సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు వచ్చారు. అప్పటికే వేదికపై టీడీపీ నాయకులు దొరబాబు, షాజహాన్, హేమలత, పీఎస్ మునిరత్నం, రాజన్, సప్తగిరి ప్రసాద్, జనసేన ఇన్‌ఛార్జి పొన్న యుగంధర్ తదితరులు ప్రసంగించారు. చంద్రబాబు వేదిక మీదకు వచ్చాక అమరనాథరెడ్డి, పులివర్తి నాని, డాక్టర్ థామస్ మాట్లాడారు. సాయంత్రం 4 నుంచి ఐదు గంటల వరకు.. సుమారు గంటపాటు చంద్రబాబు ప్రసంగం సాగింది. ఈ ప్రసంగాన్ని శ్రేణులు, మహిళలు ఆసక్తిగా విన్నారు. జిల్లా నాయకుల అవినీతి, అక్రమాల గురించి చంద్రబాబు చెప్పేటప్పుడు జనం కేకలతో ప్రతిస్పందించారు. థామస్‌ను గెలిపించాలని చంద్రబాబు కోరినప్పుడు సభికులు విశేషంగా స్పందించారు. సభా ప్రాంగణం నిండిపోయి పక్కనే ఉన్న పుత్తూరు-చిత్తూరు ప్రధాన రహదారి కూడా ప్రజలతో కిక్కిరిసింది. రామానాయుడుపల్లె వేదిక స్థలం నుంచి అటు జీడీనెల్లూరు వరకు ఇటు కొత్తపల్లిమిట్ట వరకు కార్యకర్తలు వచ్చిన వాహనాలు ఆగిపోయాయి. 5 గంటలకు చంద్రబాబు ప్రసంగం పూర్తయ్యాక వేపంజేరి మాజీ ఎమ్మెల్యే ఆర్ గాంధీ టీడీపీలో చేరారు. ఆయనకు చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డీకే ఆదికేశవులు కుమార్తె తేజస్విని వేదిక మీద చంద్రబాబును కలిశారు. 5.30 గంటలకు చంద్రబాబు హెలికాప్టర్ బయల్దేరిన తర్వాత గంటకుపైగా ట్రాఫిక్ స్తంభించింది. నగరి, పూతలపట్టు ఇన్‌చార్జులు గాలి భానుప్రకాష్, మురళి, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు. ఇక, చిత్తూరు నగర సమీప ఠాణా వద్ద గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో 15 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు.

వైసీపీ ఆఫీసులో ఫొటోలు తీశారని ఇద్దరు జనసేన కార్యకర్తలపై కేసు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6: ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ పార్టీల మధ్య విభేదాలు ముదిరిపోతున్నాయి. వీడియోలు, ఫొటోలతో ఒకరినొకరు ట్రోలింగ్ చేసేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు.శ్రీకాళహస్తి వైసీపీ ఆఫీసులో ఫొటోలు, వీడియోలు చిత్రీకరించారంటూ ఇద్దరు జనసేన కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ సీఐ నరసింహారావు కథనం మేరకు... శ్రీకాళహస్తి పట్టణం ఓటేరు కాలువకు చెందిన దినేష్, పీవీ రోడ్డు ప్రాంతానికి చెందిన గోపి జనసేన కార్యకర్తలు. సోమవారం మధ్యాహ్నం అనుమతి లేకుండా వైసీపీ కార్యాలయంలో ప్రవేశించి ఫొటోలు తీశారని, వీడియో చిత్రీకరించారని అక్కడ పనిచేసే రామసుబ్బమ్మ ఫిర్యాదు చేయగా అక్రమంగా చొరబడడం, దుర్భాషలాడటంపై కేసు నమోదు చేశారు.

రీల్స్‌కోసం వెళ్ళాం

సామాజిక మాధ్యమాల్లో రీల్స్ పోస్టు చేసేందుకు వెళితే కేసులో ఇరికించారని దినేష్ చెబుతున్నాడు. 'నా పేరు దినేష్. వైసీపీ సిద్ధం నినాదానికి ప్రతిగా జనసేన తరపున సిద్ధం రీల్స్ చేస్తున్నాం.ఇందుకోసం స్నేహితుడైన ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన గోపీతో కలిసి వైసీపీ ఆఫీస్ వద్ద రోడ్లో రీల్స్ కోసం వీడియోలు తీసుకున్నాం. నేను ఆఫీస్ వెలుపలే ఉన్నా. నా ఫోన్‌తో గోపి వైసీపీ ఆఫీసులో తెలిసిన వారితో మాట్లాడి వస్తానని లోనికి వెళ్లాడు.మధ్యలో సీఎం జగన్ చిత్రపటాన్ని గోపి వీడియో తీస్తుండగా కొందరు వైసీపీ కార్యకర్తలు గోపీని పట్టుకున్నారు. నా ఫోన్‌పై జనసేన స్టిక్కర్ ఉండడంతో మా పార్టీ నేతల సూచనతో వీడియో తీసేందుకు వచ్చానని గోపీని బలవంతంగా ఒప్పించి దాన్ని వీడియోగా చిత్రీకరించుకున్నారు. ఆ తర్వాత గోపితో పాటు నాపై కూడా ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించారు. నా ఫోనును పోలీసులు సీజ్ చేశారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.

వైసీపీ నాయకుడి ఇంట్లో 38 ఓట్లు

- ఓ కార్పొరేటర్ ఓటు కూడా అక్కడే



ఒకే ఇంటినెంబరుతో ఉన్న దొంగ ఓట్ల జాబితా

తిరుపతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఒక ఇంట్లో ఐదారు ఓట్లుండడం సహజం. పది ఓట్లుంటే రెండు పోర్షన్లలో ఉంటారులే అనుకోవచ్చు. కానీ ఏకంగా 38 ఓట్లుంటే వాటిని కచ్చితంగా దొంగ ఓట్లనే అంటారు.తిరుపతి నగరం జీవకోన ప్రాంతంలోని డోర్ నెంబరు 21-11-297 వైసీపీ సేవాదళ్ రీజనల్ కోఆర్డినేటర్ తలారి రాజేంద్రకు చెందిన ఇల్లుగా తెలుస్తోంది. ఇదే డోర్‌నెంబరు పక్కన ఏ, బీ, సీలు చేర్చి ఏకంగా 38 ఓట్లను చేర్చారు. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితాలో తవ్వేకొద్దీ దొంగ ఓట్లు బయటపడుతున్నాయి. గత ముసాయిదా జాబితాలోనూ తప్పులను సరిచేయాలని బీఎల్వోలకు ఫిర్యాదు చేసినా ఫలితంలేదు. స్థానిక నాయకుల ఒత్తిడిమేరకే నకిలీ ఓట్లను తొలగించకుండా వదిలేయడం వలన తుది జాబితాలోనూ అవే ఓట్లు వెలుగుచూశాయి. 3వ డివిజన్ లక్ష్మీపురం ప్రాంతానికి చెందిన వైసీపీ కార్పొరేటర్ గణేష్ కుమార్ ఓటు కూడా ఇదే డోర్ నెంబరులో కనిపిస్తోంది. ఒకే ఇంటి చిరునామాతో ఉన్న ఓటర్లందరూ నకిలీ అని టీడీపీ నేత కంకణాల రజనీకాంత్ మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్‌కు ఫిర్యాదు చేయగా ఆమె విచారణకు ఆదేశించినట్టు తెలుస్తోంది. అదే విధంగా శెట్టిపల్లిలోని (పోలింగ్ స్టేషన్ 238) గ్రౌండ్ ఫ్లోర్ ఉన్న ఇంటికి మూడంతస్తుల భవనం ఉన్నట్టు చూపించి 23 దొంగ ఓట్లను చేర్చారు. ఇది గమనించిన టీడీపీకి చెందిన బీఎల్ఏ మోహన్ సంబంధిత బీఎల్వోలకు ఫిర్యాదుచేసినా స్పందన లేకపోవడంతో మంగళవారం టీడీపీ నగర అధ్యక్షుడు చినబాబుతో కలసి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు

చంద్రగిరిలో దొంగ ఓట్లను ఏరేయండి

● కొన్ని ప్రాంతాల్లో ఒక్కో వ్యక్తికి 4 ఓట్లున్నాయి

● కలెక్టర్‌కు టీడీపీ నాయకురాలి ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న పులివర్తి సుధారెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లను ఏరేయండని టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ లక్ష్మీశను కలిసి ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఓటమి భయంతోనే చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి.. దొంగ ఓట్లు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. ఏడు నెలలుగా ప్రాణాలు పణంగా పెట్టి, పోరాటం చేయడంతో 22వేల ఓట్లు రిజెక్టు చేశారన్నారు. మళ్లీ వేల సంఖ్యలో దరఖాస్తులు పుట్టుకువస్తున్నాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా ఒక్కో వ్యక్తికి నాలుగు ఓట్లు గుర్తించామని చెప్పారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి 2024 జనవరి 22వ తేదీవరకు 1,27,406 మంది ఓట్ల కోసం దరఖాస్తుచేయగా 44,826 ఓట్లను రిజెక్టు చేశారన్నారు. 78,018 ఓట్లు ఆమోదించారని, ఇంకా 4,562 పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈ స్థాయిలో ఓట్లు ఆమోదించడంతో రాష్ట్ర చరిత్రలో చంద్రగిరి మొదటిస్థానంలో నిలిచిందని మండిపడ్డారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఎర్రచందనంతో 'వైసీపీ' లక్షల కోట్ల అక్రమార్జన

- తెలుగు యువత -

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 6: ఎర్రచందనంతో వైసీపీ నాయకులు లక్షల కోట్ల అక్రమార్జన చేశారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్ ఆరోపించారు. వైసీపీ అధికారాన్ని చేపట్టాక ఇసుక, మైనింగ్, సహజ వనరులను లూటీ చేస్తోందన్నారు. అన్నమయ్య జిల్లాలో టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ గణేష్ మరణం బాధాకరమన్నారు. ఇది రెడ్‌శాండిల్ మాఫియాకు పరాకాష్టగా అభివర్ణించారు.

ఓట్ ఫర్ సీబీఎన్



కార్యక్రమంలో పాల్గొన్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 6: ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని తిరుపతిలో తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ నిర్వహించాయి. పద్మావతి మహిళా యూనివర్సిటీ వద్ద చేపట్టిన కార్యక్రమంలో నాయకులు హేమంత్‌రాయల్ ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుకు ఓటు వేయాలని కోరారు. దీనివల్ల కంపెనీలు తరలివచ్చి యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీజీ వైద్యురాలి ఆత్మహత్యాయత్నం

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 6: ఎస్వీ మెడికల్ కళాశాలలో ఓ పీజీ వైద్యురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మదనపల్లెకి చెందిన విద్యార్థినికి పీజీ అనస్థీషియా సీటు రావడంతో ఆరునెలల కిందట కళాశాలలో చేరారు. ఇక్కడి పీజీ మహిళల వసతి గృహంలో ఉంటున్నారు. మంగళవారం ఉదయం హాస్టల్ గదిలో ఆమె అపస్మారక స్థితిలో ఉండటాన్ని సహచర విద్యార్థులు గమనించారు. వెంటనే రుయా అత్యవసర విభాగానికి తీసుకొచ్చి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న కుటుంబీకులొచ్చి ఆమెను స్వగ్రామానికి తీసుకెళ్లారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

క్యాన్సర్ పేషెంట్ ఆత్మహత్య



శ్రీను (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6: క్యాన్సర్ పేషెంట్ ఒకరు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. తిరుపతి ప్రభుత్వ రైల్వే హెడ్‌కానిస్టుబుల్ కోదండరాముడు తెలిపిన వివరాల ప్రకారం... పద్మావతినగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు రెండో కుమారుడు బి.శ్రీను (27) నగరంలోని ఓ మొబైల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. మంగళవారం వేకువజామున సుమారు ఐదు గంటల సమయంలో వెస్ట్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న హెడ్‌కానిస్టేబుల్ కోదండరాముడు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబీకులకు సమాచారం అందించారు. అలాగే తన చావుకు ఎవరూ కారణం కాదన్న సూసైట్ నోట్ కూడా సంఘటన స్థలం నుంచి స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. అనారోగ్యం కారణంగానే బలవన్మరణానికి పాల్పడ్డట్టు పోలీసులు స్పష్టం చేశారు. రైల్వే పోలీసులు దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్లడ్ క్యాన్సర్ వల్లే..!

డిసెంబరు నెలలో ఓ యువతితో శ్రీనుకు నిశ్చితార్థం జరిగింది. మార్చి నెలలో వివాహం జరగాల్సి ఉంది. ఇంతలోనే తనకు బ్లడ్ క్యాన్సర్ అని తెలిసింది. దాంతో తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ఈ పరిస్థితుల్లో పెళ్లి చేసుకుని ఓ యువతి జీవితాన్ని పాడు చేయకూడదని భావించి, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

ప్రసూతి మరణాలకు బాధ్యులపై చర్యలు: కలెక్టర్



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసూతి మరణాలకు బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో జరిగిన ప్రసూతి మరణాలపై సంబంధిత కుటుంబీకులు, చికిత్స అందించిన వైద్యులతోపాటు అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఆశాలతో సమావేశం నిర్వహించారు. ఎండీఎస్ఆర్ కమిటీ చైర్మన్ హోదాలో ఆగస్టు 23 నుంచి నవంబరు 23వ తేదీవరకు నాలుగు శిశు మరణాలకు, నవంబరులో రెండు మాతృ మరణాలకు చెందిన బంధువులతో మాట్లాడి వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు.

9 నుంచి నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

జిల్లాలో ఈనెల 9వ తేదీనుంచి నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యాధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆల్బెండజోల్ మాత్రలను బుధవారం నాటికి అన్ని విద్యాసంస్థలకు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్, డీఎంహెచ్‌వో శ్రీహరి, అడిషనల్ డీఎంహెచ్‌వో అరుణ సులోచన, డీపీఎంవో శ్రీనివాసరావు, అధికారులు తేజేశ్వరి, పద్మావతి, రవిప్రభు, పార్థసారథి, జయలక్ష్మి, శేఖర్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు వద్ద డబ్బు తీసుకుంటూ..

● ఏసీబీకి చిక్కిన జూనియర్ అసిస్టెంట్



పట్టుబడిన సొమ్ముతో జయరాం ఆచారి

విజయపురం, ఫిబ్రవరి 6: ఓ రైతు వద్ద రూ.13 వేలు తీసుకుంటూ మంగళవారం విజయపురం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జయరాం ఆచారి ఏసీబీకి పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. అడంగలు, ఎఫ్ ఎంటీ, వన్‌బీ కాపీల కోసం గంగమాంబాపురానికి చెందిన రైతు గాలి రమేశ్ నాయుడు దరఖాస్తు చేసుకున్నారు. ఇవ్వకపోవడంతో స్పందనలోనూ ఫిర్యాదు చేశారు. నగదు ఇస్తేనే కాపీలు ఇస్తామని డిమాండ్ చేశారంటూ ఏసీబీ అధికారులను ఆయన ఆశ్రయించారు. వారు సూచించిన ప్రకారం.. వ్యవసాయాధికారి కార్యాలయం పక్కన రూ.13 వేలను జూనియర్ అసిస్టెంటుకు ఇచ్చారు. అదే సమయంలో ఏసీబీ అధికారులు దాడులచేసి పట్టుకున్నారు. కార్యాలయంతో పాటు ఆయన ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. వివరాలను తహసీల్దార్ మల్లికార్జునరావ్ సమక్షంలో రికార్డు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం అడిగితే 1400, 1902 టోల్‌ఫ్రీ నెంబర్లలో సంప్రదించాలని ఏసీబీ అధికారులు కోరారు. కార్యక్రమంలో ఏసీబీ ఏఎస్పీ దేవప్రసాద్, డీఎస్పీ జెస్సీ ప్రశాంతి, సీఐలు ఈశ్వర్, ఎల్వీనాయుడు, సునీల్‌కుమార్, ఎస్ఐ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్సీపురం ఎంపీడీవోగా ప్రత్యూష



రామచంద్రాపురం, ఫిబ్రవరి 6: రామచంద్రాపురం ఎంపీడీవోగా ప్రత్యూష మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు బదిలీపై ఓజిలి మండలానికి వెళ్లారు. నెల్లూరు జిల్లా కోట గూడూరు మండలం నుంచి ప్రత్యూష ఇక్కడికి వచ్చారు. అలాగే తహసీల్దారు చిన్న వెంకటేశ్వర్లు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో అనంతపురం జిల్లా నుంచి ఉషారాణి తహసీల్దారుగా బాధ్యతలుచేపట్టారు. వీరికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికి సన్మానించారు.







బోల్తా పడ్డ బస్సు - గాయపడ్డ వారిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు - సంఘటనా స్థలంలో ప్రయాణికులు

ఆర్టీసీ బస్సు బోల్తా: 27 మందికి గాయాలు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 6: ఆర్టీసీ బస్సు బోల్తా పడటంతో 27 మంది ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు డిపోకు చెందిన బస్సు తిరువణ్ణామలై నుంచి తిరుమలకు వెళుతోంది. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో తిరుపతి రూరల్ మండలంలోని రామానుజపల్లె సర్కిల్ - వేదాంతపురం సర్కిల్‌కు మధ్య జాతీయ రహదారిపై వెళుతుండగా ఎదురుగా టిప్పర్ వచ్చింది. దీంతో వాహనాన్ని బస్సు డ్రైవర్ అదుపు చేయబోతుండగా రోడ్డుపక్కకు బోల్తా పడింది. బస్సులో 42మంది ప్రయాణికులు ఉండగా, 27మందికి గాయాలయ్యాయి. బాధితులను 108 అంబులెన్స్‌లో రుయాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని మాత్రం స్విమ్స్‌కు తీసుకెళ్లారు. బాధితుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు (భార్యభర్తలు, ముగ్గురు చిన్నారులు)ఉన్నారు. స్వల్ప గాయాలైన వారంతా మంగళవారమే డిశ్చార్జ్ కాగా, ఐదుగురు మాత్రమే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరు వాహనాల డ్రైవర్లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు తిరుపతి రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం : బీజేపీ



మీడియాతో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 6: వైసీపీ పాలనలో రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేశారని, జగన్ పాలన హిట్లర్ పాలనను తలపిస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి అంటూనే ప్రజలపై తీరని భారం మోపారన్నారు. సర్పంచుల హక్కుల కోసం చలో విజయవాడకు పిలుపునిస్తే వారిని ఎక్కడికక్కడ అరెస్టు చేయడాన్ని ఖండించారు. వీధి లైట్లు, బ్లీచింగ్ పౌడర్ కొనేందుకు కూడా ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడం చూస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. సీఎం రోడ్డుపై కాకుండా హెలికాప్టర్‌లోనే తిరుగుతూ ప్రొటోకాల్ నిధులు ఎంత ఖర్చు పెట్టారో ప్రజలకు తెలపాలన్నారు. వైసీపీ పాలనలో పోలీసులకు సైతం రక్షణ లేదన్నారు. నాయకులు మునిసుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, వరప్రసాద్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం భాను నైజం: వైసీపీ

తిరుపతిలో అభివృద్ధిని అడ్డుకుంటూ రాక్షసానందాన్ని పొందడం బీజేపీ నేత భానుప్రకాష్ నైజంగా మారిందని వైసీపీ యువజన విభాగ నాయకుడు పసుపులేటి సురేష్ ఆరోపించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి తిరుమలేశుడిపై నమ్మకంతో శ్రీవారి సేవ కల్పించాలని అభ్యర్థించడంపై భానుప్రకాష్‌రెడ్డి మీడియా సమావేశం పెట్టి కులమతాల మధ్య చిచ్చుపెట్టడం మంచిది కాదన్నారు. అనంతరం పలు అంశాలపైనా మాట్లాడారు. సమావేశంలో దూది శివ, మద్దాలి శేఖర్, టౌన్‌బ్యాంకు వైస్ చైర్మన్ వాసుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కాపుల ఐక్యతను దెబ్బతీయొద్దు జోగయ్యా!

● టీడీపీ నాయకుడు ఓవీ రమణ



తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 6: జనసేన, టీడీపీ పొత్తుతో ఎన్నికల్లో పోటీ చేసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో పని చేస్తుంటే కాపుల్లో చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తారా అంటూ హరిరామజోగయ్యకు టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, టీడీపీ నాయకుడు ఓవీ రమణ చురకలంటించారు.తిరుపతిలో మంగళ వారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. లేఖాస్త్రాలను మీడియాకు వదులుతూ హరిరామజోగయ్య అనవసర చర్చలకు చోటిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపుల ఐక్యత కోసం పోరాడిన ముద్రగడకు మద్దతుగా రాయలసీమ నుంచి కదిలిన కాపులపై ఆనాడు పాలకొల్లులో హరిరామజోగయ్య కుమారుడు దాడికి దిగడం కాపు జాతికి ఏం సందేశం ఇచ్చిందో చెప్పాలన్నారు. జనసేన, టీడీపీలకు మద్దతుగా కాపులను ప్రభావితం చేయాలే కాని ఇలా మీడియాకు అనవసరమైన లేఖలు పంపించే ప్రయత్నాల వెనుక ఏ కుట్ర దాగి ఉందో చెప్పాలన్నారు. రాష్ట్రంలో రెండుచోట్ల పవన్ పోటీ చేస్తే ఓడగొట్టి, మళ్లీ పవన్, చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠాన్ని పంచుకోవాలని కోరడం జోగయ్యకు భావ్యమేనా అన్నారు.ఎమ్మెల్యేగా గెలవలేకపోయాను, ముఖ్యమంత్రి స్థానాన్ని ఎలా అడగ్గలను అని నిర్మొహమాటంగా పవన్ చెబుతుంటే జనసేన పార్టీలో సభ్యుడు కూడా కాని జోగయ్య పొత్తులో భాగంగా ఎన్ని సీట్లు అడగాలో సూచించడం సబబేనా అన్నారు.స్వార్థ ప్రయోజనాల కోసం కాపుల్లో చీలిక తెస్తే కాపు ద్రోహిగా మిగిలిపోతారని హెచ్చరించారు.ఇకనైనా హరిరామజోగయ్య తన వయసుకు తగ్గట్టు నడుచుకోవాలని హితవు పలికారు.

పరిహారం ఇచ్చేదాకా పొలాల్లో దిగనివ్వం

● అధికారులకు తెగేసి చెప్పిన చిందేపల్లి రైతులు



చిందేపల్లి పొలాల్లో చెట్లను తొలగిస్తున్న ఎక్సకవేటర్

ఏర్పేడు, ఫిబ్రవరి 6: జగనన్న కాలనీ పేరిట రైతుల దగ్గర తీసుకున్న భూములకు ప్రభుత్వం పూర్తిగా పరిహారం ఇచ్చేంత వరకు పొలాల్లో ఎవరిని దిగనివ్వమని ఏర్పేడు మండల చిందేపల్లి రైతులు అధికారులతో తెగేసి చెప్పారు. ఏర్పేడు మండలం చిందేపల్లె రెవెన్యూలో తిరుపతి పట్టణంలో నివసిస్తున్న పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం మొదటి విడతలో నాలుగేళ్ల క్రితం 250 ఎకరాలు తీసుకుంది. అందులో ఇంకా 11 ఎకరాలకు సంబంధించిన ఆరుగురు రైతులకు పూర్తి పరిహారం చెల్లించలేదు. అదే విధంగా రెండవ విడతలో 37.17 ఎకరాల భూమిని 14 మంది రైతుల నుంచి తీసుకున్నారు. అయితే ఈ 14మంది రైతులకు 37 ఎకరాలకు సంబంధించి సగం మొత్తం మాత్రమే చెల్లించారు. రికార్డులు సక్రమంగా లేవని సగం మొత్తాన్ని ఇవ్వకుండా నాలుగేళ్లగా కాలయాపనచేశారు. పూర్తి పరిహారం ఇవ్వకపోవడంతో రైతులు ఆ భూమిలో ప్రస్తుతం వరి సాగు చేశారు. అయితే ఈ భూమిని చదును చేయడానికి సంబంధిత కాంట్రాక్టరు యంత్రాలతో మంగళవారం చిందేపల్లి గ్రామానికి వెళ్లాడు. సమాచారం తెలుసుకున్న చిందేపల్లి రైతులు పొలాల వద్దకు వెళ్లి తమకు పూర్తి ప రిహారం ఇచ్చేదాక భూమిలో దిగడానికి వీలులేదని అడ్డుకున్నారు. ఈ విషయాన్ని కాంట్రాక్టరు ద్వారా తెలుసుకున్న ఏర్పేడు తహసీల్దారు ఉదయ్ భాస్కర్ రాజు చిందేపల్లి గ్రామానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. చిందేపల్లి రైతుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తహసీల్దారు రైతులకు హామీ ఇచ్చారు. అలాగే రైతులు తహసీల్దారుతో మాట్లాడుతూ చిందేపల్లి రైతుల వద్ద ఇళ్ల పట్టాల పేరిట భూసేకరణ సమయంలో ప్రతి రైతుకు ఇంటి పట్టా అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారని అంతే కాకుండా పొలాల్లో ఉన్న చెట్లకు, మోటార్లకు, బోర్లకు పరిహారాన్ని అందించి భూమిని తీసుకుంటామని హామీ ఇచ్చారని అయితే ఆ హామీలు ఏవి అధికారులు, ప్రభుత్వం నెరవేర్చలేదని చెప్పారు. రైతులకు పూర్తి పరిహారం ఇవ్వకుండానే రైతులపై దాడి చేయడానికి ప్రభుత్వం ప్రయత్నంచేయడం బాధాకరమని చిందేపల్లి రైతులు వాపోయారు. ప్రస్తుతం ఎ కరాకు రూ.50వేలు అప్పు చేసి పంట వేశామని రైతులు తహసీల్దారుకు చెప్పారు. పంట చేతికొచ్చే సమయంలో చదును చేసి పట్టాలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. రైతులకు పూర్తి పరిహారం ఇవ్వడంతో పాటు, పొలాల్లో ఉన్న చెట్లకు, మోటార్లకు పరిహారం ఇచ్చే దాక పొలాన్ని వదలిపెట్టమని తెలిపారు. దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

కుక్క దాడిలో చిన్నారులకు గాయాలు



గాయపడిన చిన్నారి మానస

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 6: మండల పరిధిలోని పంజాం హరిజనవాడలో మంగళవారం వీధి కుక్క దాడిలో ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... ఆరుగురు చిన్నారులు వీధిలో ఆడుకుంటుండగా ఓ కుక్క హఠాత్తుగా వచ్చి దాడి చేసింది. మాలతి, మానస అనే ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. వీధి కుక్కలు, కోతులు ఎక్కువగా ఉన్నాయని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కలు, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పుంగనూరులో బీసీవై పార్టీ గడియారాల సీజ్

● బిల్లులు చూపిన నేతలు.. పట్టించుకోని పోలీసులు




తిమ్మికృష్ణాపురంలో గోడగడియారాలను లారీలోకి ఎక్కిస్తున్న పోలీసులు



పుంగనూరులో పోలీసులు, సీఆర్పీఎఫ్ పోలీసుల మధ్య వాగ్వాదం

పుంగనూరు. ఫిబ్రవరి 6: పుంగనూరులోని రెండు చోట్ల బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్‌కు సంబంధించిన భారీ స్థాయిలో గోడ గడియారాలను పోలీసులు సీజ్ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పోలీసు బలగాలు మంగళవారం పుంగనూరుకు చేరుకున్నాయి. పలమనేరు ఇన్‌చార్జి డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి సెర్చ్ వారెంట్ ఉత్తర్వులతో ఏకకాలంలో రెండు చోట్ల సోదాలు నిర్వహించారు. కొత్తయిండ్లులోని ఎల్ఐసీ కాలనీలో రామచంద్రయాదవ్ భద్రతా సిబ్బంది సీఆర్పీఎఫ్ పోలీసులున్న ఇంటికి స్థానిక పోలీసులు వెళ్లారు. తలుపులు కొట్టి తీయమని చెప్పగా.. సీఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు నిరాకరించారు. తమ వద్ద సెర్చ్ వారెంటు ఉందంటూ పుంగనూరు, పలమనేరు సీఐలు రాఘవరెడ్డి, చంద్రశేఖర్, ఎస్ఐ సహదేవి హెచ్చరించారు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగింది. ఇంటి చుట్టూ పోలీసులు మోహరించి, ప్రధాన మార్గం గుండా లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. మీరు సహకరించకపోతే అరెస్ట్ చేస్తామని సీఐ రాఘవరెడ్డి చెప్పారు. ఆ తర్వాత లోపలకు వెళ్లిన పోలీసులు రామచంద్రయాదవ్ ఫొటో, చెరకు రైతు గుర్తుకే మన ఓటు అని ఉన్న గోడగడియరాల బాక్సులను పరిశీలించారు. వీటిని వాహనాల్లో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాత్రి 8 గంటల వరకు పోలీసులు పంచనామా నిర్వహించారు. అదే సమయంలో మండలంలోని చదళ్ల సమీపం.. తిమ్మికృష్ణాపురంలో శివకుమార్ ఇంటి వద్ద చౌడేపల్లె, గంగవరం సీఐలు కృష్ణారెడ్డి, చిన్న గోవిందు, సదుం ఎస్ఐ మారుతి సోదాలు నిర్వహించారు. ఇంటి సమీపంలోని గదిలో ఉన్న గోడ గడియారాలను రెండు లారీల్లో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, వీటిని వాహనాల్లోకి ఎక్కించడానికి కూలీలు లేకపోవడంతో పోలీసులే మోసుకెళ్లారు. చౌడేపల్లె సీఐ అయితే లారీ ఎక్కి బాక్సులను సర్దిపెట్టించారు. హైదరాబాదులో పద్మావతి సేల్స్ కార్పొరేషన్ నుంచి ఈ నెల 5వ తేదీ 6864 గోడగడియారాలు కొనుగోలు, జీఎస్టీ, ఇతరుల పన్నులు కలిపి రూ.5,26,469చెల్లించి పుంగనూరుకు తీసుకొచ్చినట్లు బీసీవై పార్టీ నేతలు పోలీసులకు బిల్లులను చూపారు. కాగా, ఓటర్లను ప్రభావితం చేసేందుకు గోడగడియారాలు తెప్పించారని పోలీసులు సోదాలు చేసేందుకు సెర్చ్ వారెంటు జారీ అయింది.

పెద్దిరెడ్డి రాజకీయ లబ్ధి కోసం..



మంత్రి పెద్దిరెడ్డి రాజకీయ లబ్ధి కోసం కొందరు పోలీసులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ రామచంద్రయాదవ్ మీడియాకు వీడియో పంపారు. సభ్యత్వ నమోదు డ్రైవ్‌లో పాల్గొన్న తమ పార్టీ కార్యకర్తలకు కిట్లు ఇవ్వడానికి రశీదులతో గోడగడియారాలు తెప్పిస్తే.. తప్పుడు ఆరోపణలతో వాటిని సీజ్ చేయడం దారుణమన్నారు. వీటిపై తాను న్యాయపోరాటం చేస్తానని చెప్పారు.

అవకాశమిస్తే పలమనేరు నుంచి పోటీ చేస్తా

● జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6: పలమనేరు అసెంబ్లీ అభ్యర్థిగా తనకు అధిష్ఠానం అవకాశం ఇస్తే పోటీచేస్తానని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా వున్న వెంకటేగౌడను మార్చాలని, ఆయన స్థానంలో పోటీ చేయాలని అధిష్ఠానం నిర్ణయిస్తే కట్టుబడి ఉంటానన్నారు. తన అభ్యర్థిత్వానికి పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి సుధ, మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ రెడ్డి, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి, పలమనేరు, గంగవరం ఎంపీపీలు రెడ్డెప్ప, రెడ్డెప్ప, శ్రీదేవి, మురళీమోహన్ రెడ్డి తదితరులు మద్దతు ఇస్తున్నారన్నారు. పలమనేరు స్థానానికి పోటీచేసే విషయమై అంతకు ముందు ఆయన తన చాంబరులో అనుచరులతో మంతనాలు చేశారు.

ఎంపీడీవోలకు మండలాల కేటాయింపు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు వచ్చిన వారికి పోస్టింగ్స్ ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎంపీడీవోల్లో 23 మందిని అనంతపురం జిల్లాకు, ముగ్గురిని కడప జిల్లాకు బదిలీ చేశారు. వారి స్థానంలో చిత్తూరు జిల్లాకు 17మందిని నెల్లూరు జిల్లాకు, 15 మందిని కడప జిల్లా నుంచి వెరసి 32 మందిని బదిలీ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో మండలాల్లో ఖాళీలను బట్టి పోస్టింగ్ ఇచ్చారు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించేవరకు వీరు చిత్తూరు జిల్లాలో విధులు నిర్వహించనున్నారు.

కేటాయించిన మండలాలివీ..

● కడప జిల్లా నుంచి వచ్చిన 13 మందిలో సి.వెంకటేశు (చౌడేపల్లి), జి.రవికుమార్ రెడ్డి (నగరి), కె.వి.శ్రీధర్ నాయుడు (కార్వేటినగరం), టి.వెంగముని రెడ్డి (పుంగనూరు), పి.వరప్రసాద్ (సోమల), జె.సుజాతమ్మ (వడమాలపేట), ఎస్.నూర్జహాన్ (బికొత్తకోట), ఎ.జగదీశ్వర్ రెడ్డి (గుర్రంకొండ), జి.రెడ్డయ్య (కేవీపల్లి), సి.రామక్రిష్ణయ్య (కలికిరి), బి.మైథిలి (నిమ్మనపల్లి), సి. వెంకటరమణయ్య (పెద్దమండ్యం), జి.కృష్ణమూర్తి (తంబళ్ళపల్లి) మండలాల్లో పోస్టింగులు ఇచ్చారు.

● నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన 17 మందిలో... ఎన్ గోపి (గుడుపల్లి), ఎం.భవాని (నింద్ర), కె.వెంకటేశ్వరరావు (పెనుమూరు), కె.సురేష్‌బాబు (పులిచెర్ల), బి.సింగయ్య (యాదమరి), పి.ప్రసన్నకుమారి (పూతలపట్టు), జి.వెంకటేశ్వర్లు (తవణంపల్లి), కె.గోవర్ధన్ (వి.కోట), ఎం.బ్రహ్మయ్య (విజయపురం), ఎం.భాస్కర్ (గంగాధరనెల్లూరు), కె.షాలెట్ (బి.ఎన్. కండ్రిగ), వి.వి. సూర్యసాయి (చంద్రగిరి), కె.వి.శివప్రసాద్ (కేవీబీ పురం), కె.నాగేంద్రబాబు (పాకాల), కె.ప్రత్యూష (రామచంద్రాపురం), పి. ఐజాక్ ప్రవీణ్ (తొట్టంబేడు), ఎం.మధుసూదనరావు (ఎర్రావారిపాళ్యం) మండలాలను కేటాయిస్తూ పోస్టింగులు ఇచ్చారు.

కుంట పోరంబోకులో ఇంటి నిర్మాణం



చంద్రగిరి, ఫిబ్రవరి 6: పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారి ఆనుకొని ఉన్న ఐతేపల్లెలోని ప్రభుత్వ కుంట పోరంబోకు భూమిలో అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మండలంలోని ఐతేపల్లె రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నెంబర్ 252లో 6.85 ఎకరాలలో కుంట పోరంబోకు స్థలం ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో ఐతేపల్లెలోని అర్హులైన వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని అప్పట్లో ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారుల వద్దకు ప్రతిపాదనలు తీసుకురాగా అది ప్రభుత్వ కుంట పోరంబోకు స్థలమని అందులో ఇంటి స్థలాలు ఇవ్వడానికి అనుమతిలేదని తెలిపారు. ప్రస్తుతం ఐతేపల్లెకు చెందిన వారు ఆ స్థలంలో ఇంటి నిర్మాణాలు చేపట్టడం గమనార్హం.

దేవుడి సొమ్ముతో దొరికిపోయిన దొంగ

ఐరాల, ఫిబ్రవరి 6: ఆలయంలో చోరీ చేసిన ఆభరణాలతో పారిపోవడానికి సిద్ధంగా ఉన్న దొంగను ఐరాల ఎస్ఐ వెంకటేశ్వర్లు మంగళవారం చాకచక్యంగా పట్టుకున్నారు. ఎస్ఐ కథనం మేరకు పాకాల మండలం ఫకీరుపేటకు చెందిన సుబ్రహ్మణ్యం ఐరాల మండలంలోని పొలకల సమీపంలోని దండు మారియమ్మ ఆలయంలో ఈ నెల 2వ తేదీన చోరీ చేశాడు. విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు ఐరాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడు వెండి ఆభరణాలను గతంలో తనకు జైలులో పరిచయమైన పాతనేరస్తులు రాయచోటికి చెందిన శివకుమార్, చిన్న సహకారంతో చిత్తూరులో విక్రయించడానికి వెళుతుండగా, అతడిని పాటూరుసంతగేటు వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి వెండి గొడుగు, శిరస్సు, బిందె, వడ్డాణాన్ని స్వాధీనపరచుకున్నారు.

చిన్నగొట్టిగల్లు తహసీల్దారుగా నాగరాజు



భాకరాపేట, ఫిబ్రవరి 6: చిన్నగొట్టిగల్లు తహసీల్దారుగా నాగరాజు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈయన అనంతపురం జిల్లా చిలమత్తూరు నుంచి వచ్చారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న లోకేశ్వరి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు.

'రా...కదలిరా' సభకు తరలిన తెలుగు తమ్ముళ్లు



భాకరాపేట, ఫిబ్రవరి 6: చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరులో మంగళవారం జరిగిన 'రా...కదలిరా' బహిరంగ సభకు చిన్నగొట్టిగల్లు మండలం నుంచి టీడీపీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.69 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.69 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 64,512 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,491 మంది తలనీలాలు సమర్పించారు.

సాయిబాబా ఆలయ హుండీ ఆదాయం రూ.7.85లక్షలు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 6: కొంకావీధిలోని సాయిబాబా ఆలయ హుండీ ఆదాయం రూ.7.85లక్షలు లభించింది. ఈ కార్యక్రమంలో ద్వారకామాయి షిరిడీ సాయిబాబా సేవా కమిటీ గౌరవాధ్యక్షులు ముబ్బుదేవనారాయణరెడ్డి, కుడితి సుబ్రహ్మణ్యంయాదవ్, కార్యదర్శి ఎం.శివ, సంయుక్త కార్యదర్శి డి.శ్రీనివాసులరెడ్డి, ఉపాధ్యక్షులు విజయలక్ష్మి, బాలకృష్ణ, శీనుయాదవ్, రాజమణియమ్మ, రవి, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి రాజధాని అవుతుంది : చింతా మోహన్



తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 6: బ్రహ్మంగారి కాలజ్ఞానం ప్రకారం తిరుపతి రాజధాని అవుతుందన్న నమ్మకం తనకుందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అభిప్రాయపడ్డారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. రాజధాని విషయంలో జగన్, చంద్రబాబు తమ అభిప్రాయాలను రాయలసీమ ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయంటూ మండిపడ్డారు. నాయకులు యార్లపల్లిగోపి, శాంతి, లీల, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్' కార్యవర్గం



తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 6: ది పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటైంది. మంగళవారం జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.అర్జునయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీ పరిచయ కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి ద్వారా ప్రతినిధులకు నియామక పత్రాలను అందజేశారు. జిల్లా అధ్యక్షుడిగా ఐ.బాబు, కార్యదర్శిగా జి.నరసింహులు, ఛైర్మన్‌గా ఎన్.అల్లయ్య, ట్రెజరర్‌గా పరమేశ్వర, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాంబాబు ఎన్నికయ్యారు. డిప్యూటీ సీఎంఈ నరసింహులు, డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, ఏటీఎం సురేంద్రబాబు, డీఎం భాస్కర్, సంఘం రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షురాలు ఇ.లతారెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.టి.ఆర్.రెడ్డి, జి.వి.ముని, రాష్ట్ర కార్యదర్శులు మురళీధరన్, రమణరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తిరుపతి పార్లమెంటు బీజేపీ కార్యదర్శిగా శేఖర్



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 6: తిరుపతి పార్లమెంటు బీజేపీ కార్యదర్శిగా మలకుప్పం శేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు బెస్త చంద్రప్ప, రాష్ట్ర అధికార ప్రతినిధులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముని సుబ్రహ్మణ్యం, తిరుపతి అసెంబ్లీ కన్వీనర్ అజయ్‌కుమార్‌లకు ఈ సందర్భంగా శేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమలలో తమిళనాడువాసి ఆత్మహత్య?



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుమల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఓ తమిళనాడువాసి ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. తిరుమల టూటౌన్ ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడులోని విల్లుపురం జిల్లా మిట్టమంద గపట్టే గ్రామానికి చెందిన దండపాణి(82) సోమవారం తిరుమలకు వచ్చాడు. జీఎన్సీ వింద్‌ప్యాన్ సమీపంలో మంగళవారం సాయంత్రం ఎలాంటి కదలికలు లేకుండా పడిపోయి ఉండటాన్ని అక్కడి సిబ్బంది గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించగా, అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పక్కనే విషం బాటిల్ ఉండటంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్నారు. జేబులో పాస్‌పోర్టు ఫొటోలున్న కవర్ కనిపించింది. దానిపై ఉన్న అడ్రస్ ఆధారంగా వివరాలను గుర్తించి, కుటుంబీకులకు సమాచారాన్ని అందించారు.

తిరుపతిలో విజయవాడవాసి మృతి



దుర్గాప్రసాద్ (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6: విజయవాడకు చెందిన వ్యక్తి తిరుపతిలోని ఓ హోటల్లో మృతి చెందాడు. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన దుర్గాప్రసాద్ (39) చోళమండలం ఫైనాన్స్ కంపెనీకి న్యాయ సలహాదారుగా ఉంటున్నారు. కంపెనీ పనిపై సోమవారం తిరుపతికి వచ్చిన ఆయన ఓ హోటల్లో బస చేశారు. మంగళవారం ఆయన స్నేహితులు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా సమాధానం లేకపోవడంతో వారు హోటల్ సిబ్బందిని సంప్రదించారు. సిబ్బంది అతడి గది వద్దకెళ్లి ఎన్నిసార్లు పిలిచినా స్పందన లేదు. దాంతో డూప్లికేట్ తాళంతో గదిని తెరిచారు. అప్పటికే ఆయన అపస్మారక స్థితిలో కనిపించారు. రుయాస్పత్రికి తరలించగా మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగ క్రికెటర్లకు ప్రభుత్వం సహకరించాలి : ఏపీడీసీఏ



దివ్యాంగుల క్రికెట్ టోర్నీలో పాల్గొంటున్న క్రీడాకారులు, కమిటీ సభ్యులు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 6: దివ్యాంగ క్రికెటర్లకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని ఏపీ దివ్యాంగ క్రికెట్ అసోసియేషన్ (ఏపీడీసీఏ) కార్యదర్శి, టీమ్ కెప్టెన్ వసంత్‌కుమార్ కోరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో కోశాధికారి రామిరెడ్డి, ఐటీ స్పోర్ట్స్ కార్యదర్శి షేక్ శంషాద్‌బేగంతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే తమ అసోసియేషన్ తరపున జాతీయ స్థాయిలో జరిగిన టోర్నీల్లో రాష్ట్రం తరపున హాజరై ప్రతిభ చూపామన్నారు. ప్రస్తుతం రాజస్థాన్ ప్రభుత్వం డిజేబుల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న టోర్నీకి వెళుతున్నామన్నారు. తమకు మరింత శిక్షణ ఇస్తే మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తామని చెప్పారు. ఉపాధ్యక్షుడు అశోక్, సంయుక్త కార్యదర్శి తేజ, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా కరాటే శ్రీను



శ్రీనుని అభినందిస్తున్న అభినయ్‌రెడ్డి

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 6: ఈఎస్‌ఐ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా కరాటే శ్రీను(గునుకుల శ్రీనివాసరావు) మంగళవారం నియమితులయ్యారు. ఈయన్ను మంగళవారం నగరంలో జరిగిన వైసీపీ సమావేశంలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అభినందించారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నిస్వార్థంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా శ్రీను తెలిపారు. అలాగే తనకీ పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, అభినయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫొటో భవన్ ఏర్పాటుకు సహకారం

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 6: తిరుపతి, తిరుమల ఫొటోగ్రాఫర్స్ సౌకర్యార్థం నగరంలో ఫొటోభవన్ ఏర్పాటుకు సహకరిస్తామని ఉపమేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం యూత్ హాస్టల్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ జాక్వెస్ మండే డ్యాగురే విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అసోసియేషన్ తిరుపతి అధ్యక్షుడు మోహన్‌రాజ్, కార్యదర్శి అమర్నాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.ఆర్.రాజు, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో శాస్త్రవేత్తల కొరత

అధిగమించడానికి సైన్స్ టీచర్లు కృషి చేయాలి

ఐసర్ రిజిస్ట్రార్ విజయమోహనన్ పిళ్లై



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నారాయణరావు, విజయమోహనన్ పిళ్లై తదితరులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 6: దేశంలో శాస్త్రవేత్తల కొరత ఉందని, దీన్ని అధిగమించడానికి సైన్స్ టీచర్లు కృషి చేయాలని తిరుపతికి చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.విజయమోహనన్ పిళ్లై సూచించారు. తిరుపతిలోని భారతీయ విద్యాభవన్స్‌లో సైన్స్ టీచర్లకు నిర్వహించిన రెండ్రోజుల ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ని ఐఎస్‌టీఏఫ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ డి.నారాయణరావు, డాక్టర్ టి.నారాయణరావు, రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ప్రతినిధి కరిమా అంజుమ్, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. పాఠశాల దశ నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచి, భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సాహించాలని చెప్పారు. ఐఎస్‌టీఏఫ్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో సైన్స్ అండ్ టెక్నాలజీ ఎంతో కీలకమన్నారు. విద్యార్థులు, టీచర్లలలో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించాలన్న లక్ష్యంతో ఐఎస్‌టీఏఫ్ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని వివరించారు. ఆర్ఎస్‌సీ ప్రతినిధి కరిమా అంజుమ్ మాట్లాడుతూ టీచర్లు తమసామర్థ్యాలను పెంచుకునేందుకు శాస్త్రీయ పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ మాట్లాడుతూ.. ఇటువంటి శిక్షణల ద్వారా బోధనా నైపుణ్యాలను సైన్స్ టీచర్లు పెంచుకోవాలని సూచించారు. బీవీబీ డైరెక్టర్ సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

నిష్పాక్షికంగా ఎన్నికల నిర్వహణ : కలెక్టర్



రాజకీయపార్టీల నేతలతో సమావేశమైన కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మీశ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలతో కలిసి ఓటర్ల జాబితా అభ్యంతరాలపై, ఎన్నికల సన్నద్ధతపై సమావేశం నిర్వహించారు. ఓటర్ల తొలగింపులు ఒక నియోజకవర్గంలో 0.1శాతం మించి ఉంటే సీఈవో అనుమతి తీసుకోవడం తప్పనిసరి అన్నారు. స్వీప్ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా ఈవీఎం డెమాన్‌స్ట్రేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ సెంటరుగా మహిళా విశ్వవిద్యాలయం పరిశీలనలో ఉందని తెలిపారు. రాజకీయపార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీఆర్వో పెంచలకిషోర్, ఈఆర్వో అదితిసింగ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పులివర్తి సుధారెడ్డి, మనోహర్, పురుషోత్తం నాయుడు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పొరబాట్లు లేకుండా విధులు నిర్వహించాలి

బీఎల్వో నుంచి పైస్థాయి అధికారి వరకు పొరబాట్లకు తావు లేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం రాత్రి జిల్లాలోని మండల స్థాయి అధికారులకు ఎన్నికల సన్నద్ధతపై వర్చువల్ విధానంలో దిశానిర్దేశం చేశారు.

ఆ రెండ్రోజుల్లోనూ పీజీ డాక్టర్లే దిక్కు

రుయా న్యూరోసర్జరీ ఓపీలో కానరాని హెచ్‌వోడీలు





రోగులను పరీక్షిస్తున్న పీజీ డాక్టర్లు - సిబ్బందితో వాగ్వాదానికి దిగిన రోగులు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 6: రుయాస్పత్రిలో మంగళ, శుక్రవారాల్లో న్యూరోసర్జరీ ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయి. ప్రాణాంతక వ్యాధులు కావడంతో విభాగాధిపతు (హెచ్‌వోడీ)లే రోగులను పరీక్షించాలి. అదేసమయంలో పీజీ డాక్టర్లరూ శిక్షణ ఇవ్వాలి. కానీ ఈ రెండ్రోజుల్లోనూ కేవలం పీజీ డాక్టర్లతోనే ఓపీ సేవలు నిర్వహిస్తున్నారు. మంగళవారం కూడా హెచ్‌వోడీస్థాయి అధికారులు అందుబాటులో లేరు. దాంతో పీజీ డాక్టర్లు నెమ్మదిగా పరీక్షిస్తుండటంతో కొందరు రోగులు అక్కడి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. పైగా ఓసారి పరీక్షించిన వైద్యుడు మళ్లీ వచ్చినపుడు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి గంటల తరబడి ఓపీ గది నిరీక్షించాల్సి వస్తోందన్నారు. సమయం ముగియడంతో మళ్లీ రావాలంటే మరో మూడ్రోజులు ఎదురు చూడాల్సి వస్తుందని వాపోయారు. ఇకనైనా హెచ్‌వోడీలు ఈ రెండ్రోజులు అందుబాటులోకి వస్తే ఇటువంటి సమస్యలు ఉండవని రోగులు అంటున్నారు.

'రిపబ్లిక్ డే'లో తిరుపతి ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ

ఈక్వెస్ట్రియన్‌లో బంగారు పతకం - జూనియర్ విభాగంలో బెస్ట్‌ఆర్మీ క్యాడెట్ అవార్డు





ప్రధాని మోదీ చేతులమీదుగా లాఠీని అందుకుంటున్న ఎడిఫై స్కూల్ విద్యార్థి శ్రీశాంత్ - తిరుపతి గ్రూపునకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు, శిక్షణ బృందం

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 6: న్యూఢిల్లీలో గతనెల26వ తేదీన జరిగిన గణతంత్ర దినోత్సవంలో తిరుపతి గ్రూపునకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు అద్భుత ప్రదర్శన ఇచ్చి, బంగారు, కాంస్య పతకాలను సాధించారు. ఈ మేరకు 29 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ మనీష్ అస్థాన పేర్కొన్నారు. తిరుపతిగ్రూపులోని పలుయూనిట్లకు చెందిన 10మంది క్యాడెట్లు అన్ని కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభచాటారని తెలిపారు. ఈక్వెస్ట్రియన్ ఈవెంట్‌లో జి.లోహిత్, చిత్తేష్‌రావు అద్భుత ప్రదర్శనతో జాతీయస్థాయిలో బంగారు పతకాన్ని సాధించగా.. బెస్ట్ ఎయిర్ క్యాడెట్ విభాగంలో ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్‌కి చెందిన క్యాడెట్ తరుణ్‌తేజ కాంస్య పతకాన్ని పొందారని వివరించారు. జూనియర్ విభాగంలో ఎస్.శ్రీశాంత్.. బెస్ట్ ఆర్మీ క్యాడెట్ అవార్డు సాధించి చరిత్ర సృష్టించారన్నారు. శ్రీకాంత్‌కి ప్రధాని నరేంద్రమోదీ వ్యక్తిగతంగా గౌరవపతకం, లాఠీని అందజేసి అభినందించారన్నారు. తిరుపతి ఎన్‌సీసీ గ్రూపు చరిత్రలో ఇటువంటి బహుమతి అందుకోవడం ఇదేతొలిసారి అని, దక్షిణభారతస్థాయిలోనూ బెస్ట్ ఆర్మీ క్యాడెట్ అవార్డు రావడం సంతోషంగా ఉందని తెలియజేశారు. కాగా.. శ్రీశాంత్ తిరుచానూరులోని ఎడిఫై ఇంటర్నేషనల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతూ.. ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆఫ్ ఏపీ, తెలంగాణ ఆధ్వర్యంలో రెండేళ్లుగా శిక్షణ పొందుతున్నాడు. ఈవిద్యార్థి 2023సెప్టెంబరులో నిర్వహించిన ఆలిండియా థాల్‌సేన క్యాంప్‌లో జాతీయస్థాయిలో బంగారు, కాంస్య పతకాలు సాధించాడు. ప్రతిభ చూపిన వారిని మనీష్ అస్థానతో పాటు తిరుపతిఎన్‌సీసీ గ్రూపు కమాండర్ కల్నల్ యోగేష్ డుంగరకోటి, ఎడిఫైస్కూల్ యాజమాన్యం, టీచర్లు అభినందించారు.

డీఎస్టీ క్యూరీ కేంద్రానికి రూ.25 లక్షల మంజూరు



నిధుల మంజూరు పత్రాలు చూపుతున్న వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 6: పద్మావతి మహిళా యూనివర్సిటీలోని డీఎస్టీ క్యూరీ కేంద్రానికి రూ.25 లక్షలు మంజూరయ్యాయి. ఈ విషయాన్ని వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని మంగళవారం వెల్లడించారు. ఈ నిధులను ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, కాన్ఫరెన్స్‌ల నిర్వహణకు ఉపయోగిస్తామన్నారు. వీటితోపాటు అగ్మెంటెడ్ రియాలిటీపై మూడునెలల సర్టిఫికెట్ కోర్సును ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల జారీలో అలసత్వం వహిస్తే చర్యలు

ఎస్వీయూ వీసీ హెచ్చరిక



అధికారులకు సూచనలిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 6: యూనివర్సిటీ, అనుబంధ కాలేజీల్లో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు సర్టిఫికెట్ల జారీలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎస్వీయూ వీసీ శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. పరీక్షల విభాగం అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. పరీక్షల విభాగంపై వస్తున్న విమర్శలను పరిగణనలోకి తీసుకొని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరీక్షల డీన్ కిషోర్, సీఈ దామ్లానాయక్, డిప్యూటీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వేటూరి జయంతి కార్యక్రమం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 6: ఎస్వీయూనివర్సిటీ ప్రాచ్య పరిశోధనా సంస్థ (ఓఆర్‌ఐ)లో బుధవారం ఉదయం 10 గంటలకు వేటూరి ప్రభాకరశాస్త్రి జయంతి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఓఆర్‌ఐ డైరెక్టర్ డాక్టర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు.

రేపు విశ్వంలో నవోదయ మోడల్ టెస్ట్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 6: వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్‌లో ఈనెల8న గురువారం ఉదయం9గంటలకు జవహర్ నవోదయ ఉచిత మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు స్కూల్ ఛైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో నవోదయ విద్యాలయాల్లో 9,11 తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 10న నిర్వహించే ప్రవేశపరీక్షకు అనుగుణంగా ఈ నమూనా పరీక్షను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎలాంటి ప్రవేశ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, విద్యార్థుల హాల్‌టికెట్ (అడ్మిట్‌కార్డు) జెరాక్స్ కాపీని తీసుకొచ్చి నమూనా పరీక్షను రాయవచ్చన్నారు. వివరాలకోసం 86888 88802, 93999 76999 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు



తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 6: తిరుపతి రైల్వేస్టేషన్‌లో మంగళవారం పోలీసు, భద్రతా సిబ్బంది సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ సీఐ మధుసూదన్ మాట్లాడుతూ.. విలువైన వస్తువులతో ప్రయాణించవద్దని సూచించారు. ఎన్నికల సందర్భంగా కరెన్సీ నోట్లు, ఇతర నిషేధ వస్తువులతో ప్రయాణిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హేమసుందర్, ధర్మేంద్ర రాజు, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ ఈవోను కలసిన కలెక్టర్



తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: టీటీడీ పరిపాలన భవనంలో మంగళవారం ఈవో ధర్మారెడ్డిని కలెక్టర్ లక్ష్మీశ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీటీడీ ఉద్యోగుల కోసం ఇళ్ల స్థలాలు, భూసేకరణ, మ్యుటేషన్ అంశాలపై జేసీ శుభం బన్సల్‌లో కలిసి ఈవోతో చర్చించారు. శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ అర్చకులకు పునశ్చరణ తరగతులు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న భూమన్, రాణి సదాశివమూర్తి తదితరులు

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 6: టీటీడీ ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు మంగళవారం శ్రీవేంకటేశ్వర ఉద్యోగుల శిక్షణ సంస్థ (శ్వేత) ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో మూడ్రోజులపాటు ఈ తరగతులు జరుగుతాయి. తొలిరోజున వేదవర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివ మూర్తి మాట్లాడుతూ.. ఇటువంటి పునశ్చరణ తరగతులతో అర్చకవ్యవస్థ బలపడుతుందని చెప్పారు. శ్వేత సంచాలకుడు భూమన్ మాట్లాడుతూ... ఈ తరగతుల్లో ఆరోగ్య సూత్రాలపై కూడా శిక్షణ ఇస్తామన్నారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు మాట్లాడుతూ.. పూజా కైంకర్యాలు నిష్ఠతో చేయాలన్నారు. టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు పి.సీతారామాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



జయరాం ఠాకూర్ - రిచర్డ్ రిషి

తిరుమల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. హిమాచల్‌ప్రదేశ్ మాజీ సీఎం జయరాం ఠాకూర్, సినీనటుడు రిచర్డ్ రిషి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

నేడు 'శ్రీవేంకటేశ్వర నవరత్న మాలిక'

తిరుమలలోని కల్యాణవేదికలో బుధవారం 'శ్రీవేంకటేశ్వర నవరత్న మాలిక' గోష్ఠిగానం జరగనుంది. రాత్రి ఏడు గంటలకు దాదాపు 300 మంది సుప్రసిద్ధ కళాకారులు గోష్ఠిగానం చేయనున్నారు. అలాగే కర్ణాటక సంగీత పితామహులు పురందరదాసు ఆరాధన మహోత్సవాలు టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గురువారం నుంచి శనివారం వరకు తిరుమలలో ఆస్థానమండపంలో జరగనున్నాయి.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం



తిరుపతి (విద్య), ఫిబ్రవరి 6: యశోదనగర్‌లోని లిటిల్‌ఏంజల్స్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ కె.రాజగోపాల్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ ఎం.రమాదేవి, ప్రిన్సిపాల్ పద్మశ్రీ, టీచర్లు పాల్గొన్నారు.

కుక్కదాడిలో చిన్నారులకు గాయాలు


గాయపడిన చిన్నారి మానస

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 6: మండల పరిధిలోని పంజాం హరిజనవాడలో మంగళవారం వీధి కుక్క దాడిలో ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... ఆరుగురు చిన్నారులు వీధిలో ఆడుకుంటుండగా ఓ కుక్క హఠాత్తుగా వచ్చి దాడి చేసింది. మాలతి, మానస అనే ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. వీధి కుక్కలు, కోతులు ఎక్కువగా ఉన్నాయని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కలు, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తిరుపతిలో విజయవాడవాసి మృతి


దుర్గాప్రసాద్ (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6: విజయవాడకు చెందిన వ్యక్తి తిరుపతిలోని ఓ హోటల్లో మృతి చెందాడు. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన దుర్గాప్రసాద్ (39) చోళమండలం ఫైనాన్స్ కంపెనీకి న్యాయ సలహాదారుగా ఉంటున్నారు. కంపెనీ పనిపై సోమవారం తిరుపతికి వచ్చిన ఆయన ఓ హోటల్లో బస చేశారు. మంగళవారం ఆయన స్నేహితులు ఎన్నిసార్లు ఫోన్‌చేసినా సమాధానం లేకపోవడంతో వారు హోటల్ సిబ్బందిని సంప్రదించారు. సిబ్బంది అతడి గది వద్దకెళ్లి ఎన్నిసార్లు పిలిచినా స్పందన లేదు. దాంతో డూప్లికేట్ తాళంతో గదిని తెరిచారు. అప్పటికే ఆయన అపస్మారక స్థితిలో కనిపించారు. రుయాస్పత్రికి తరలించగా మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీడీవోలకు మండలాల కేటాయింపు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు వచ్చిన వారికి పోస్టింగ్స్ ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎంపీడీవోల్లో 23 మందిని అనంతపురం జిల్లాకు, ముగ్గురిని కడప జిల్లాకు బదిలీ చేశారు. వారి స్థానంలో చిత్తూరు జిల్లాకు 17మందిని నెల్లూరు జిల్లాకు, 15 మందిని కడప జిల్లా నుంచి వెరసి 32 మందిని బదిలీ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో మండలాల్లో ఖాళీలను బట్టి పోస్టింగ్ ఇచ్చారు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించేవరకు వీరు చిత్తూరు జిల్లాలో విధులు నిర్వహించనున్నారు.

కేటాయించిన మండలాలివీ..

● కడప జిల్లా నుంచి వచ్చిన 13 మందిలో సి.వెంకటేశు (చౌడేపల్లి), జి.రవికుమార్ రెడ్డి (నగరి), కె.వి.శ్రీధర్ నాయుడు (కార్వేటినగరం), టి.వెంగముని రెడ్డి (పుంగనూరు), పి.వరప్రసాద్ (సోమల), జె.సుజాతమ్మ (వడమాలపేట), ఎస్.నూర్జహాన్ (బి.కొత్తకోట), ఎ.జగదీశ్వర్ రెడ్డి (గుర్రంకొండ), జి.రెడ్డయ్య (కేవీపల్లి), సి.రామక్రిష్ణయ్య (కలికిరి), బి.మైథిలి (నిమ్మనపల్లి), సి.వెంకటరమణయ్య (పెద్దమండ్యం), జి.కృష్ణమూర్తి (తంబళ్ళపల్లి) మండలాల్లో పోస్టింగులు ఇచ్చారు.

● నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన 17 మందిలో... ఎన్ గోపి (గుడుపల్లి), ఎం.భవాని (నింద్ర), కె.వెంకటేశ్వరరావు (పెనుమూరు), కె.సురేష్‌బాబు (పులిచెర్ల), బి.సింగయ్య (యాదమరి), పి.ప్రసన్నకుమారి (పూతలపట్టు), జి.వెంకటేశ్వర్లు (తవణంపల్లి), కె.గోవర్ధన్ (వి.కోట), ఎం.బ్రహ్మయ్య (విజయపురం), ఎం.భాస్కర్ (గంగాధరనెల్లూరు), కె.షాలెట్ (బి.ఎన్.కండ్రిగ), వి.వి.సూర్యసాయి (చంద్రగిరి), కె.వి.శివప్రసాద్ (కేవీబీ పురం), కె.నాగేంద్రబాబు (పాకాల), కె.ప్రత్యూష (రామచంద్రాపురం), పి.ఐజాక్ ప్రవీణ్ (తొట్టంబేడు), ఎం.మధుసూదనరావు (ఎర్రావారిపాళ్యం) మండలాలను కేటాయిస్తూ పోస్టింగులు ఇచ్చారు.

అవకాశమిస్తే పలమనేరు నుంచి పోటీ చేస్తా

● జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6: పలమనేరు అసెంబ్లీ అభ్యర్థిగా తనకు అధిష్ఠానం అవకాశం ఇస్తే పోటీచేస్తానని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా వున్న వెంకటేగౌడను మార్చాలని, ఆయన స్థానంలో పోటీ చేయాలని అధిష్ఠానం నిర్ణయిస్తే కట్టుబడి ఉంటానన్నారు. తన అభ్యర్థిత్వానికి పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి సుధ, మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ రెడ్డి, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి, పలమనేరు, గంగవరం ఎంపీపీలు రెడ్డెప్ప, రెడ్డెప్ప, శ్రీదేవి, మురళీమోహన్ రెడ్డి తదితరులు మద్దతు ఇస్తున్నారన్నారు. పలమనేరు స్థానానికి పోటీచేసే విషయమై అంతకుముందు ఆయన తన చాంబరులో అనుచరులతో మంతనాలు చేశారు.

రైతు వద్ద డబ్బు తీసుకుంటూ..

● ఏసీబీకి చిక్కిన జూనియర్ అసిస్టెంట్


పట్టుబడిన సొమ్ముతో జూనియర్ అసిస్టెంట్ జయరాం ఆచారి

విజయపురం, ఫిబ్రవరి 6: ఓ రైతు వద్ద రూ.13 వేలు తీసుకుంటూ మంగళవారం విజయపురం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జయరాం ఆచారి ఏసీబీకి పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. అడంగలు, ఎఫ్ఎంబీ, వన్‌బీ కాపీల కోసం గంగమాంబాపురానికి చెందిన రైతు గాలి రమేశ్ నాయుడు దరఖాస్తు చేసుకున్నారు. ఇవ్వకపోవడంతో స్పందనలోనూ ఫిర్యాదు చేశారు. నగదు ఇస్తేనే కాపీలు ఇస్తామని డిమాండ్ చేశారంటూ ఏసీబీ అధికారులను ఆయన ఆశ్రయించారు. వారు సూచించిన ప్రకారం.. వ్యవసాయాధికారి కార్యాలయం పక్కన రూ.13 వేలను జూనియర్ అసిస్టెంటుకు ఇచ్చారు. అదే సమయంలో ఏసీబీ అధికారులు దాడులచేసి పట్టుకున్నారు. కార్యాలయంతో పాటు ఆయన ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. వివరాలను తహసీల్దార్ మల్లికార్జునరావ్ సమక్షంలో రికార్డు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం అడిగితే 1400, 1902 టోల్‌ఫ్రీ నెంబర్లలో సంప్రదించాలని ఏసీబీ అధికారులు కోరారు. కార్యక్రమంలో ఏసీబీ ఏఎస్పీ దేవప్రసాద్, డీఎస్పీ జెస్సీ ప్రశాంతి, సీఐలు ఈశ్వర్, ఎల్వీనాయుడు, సునీల్‌కుమార్, ఎస్ఐ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ అర్చకులకు పునశ్చరణ తరగతులు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న భూమన్, రాణి సదాశివమూర్తి తదితరులు

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 6: టీటీడీ ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు మంగళవారం శ్రీవేంకటేశ్వర ఉద్యోగుల శిక్షణ సంస్థ (శ్వేత) ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో మూడ్రోజులపాటు ఈ తరగతులు జరుగుతాయి. తొలిరోజున వేదవర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ.. ఇటువంటి పునశ్చరణ తరగతులతో అర్చకవ్యవస్థ బలపడుతుందని చెప్పారు. శ్వేత సంచాలకుడు భూమన్ మాట్లాడుతూ... ఈ తరగతుల్లో ఆరోగ్య సూత్రాలపై కూడా శిక్షణ ఇస్తామన్నారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు మాట్లాడుతూ.. పూజా కైంకర్యాలు నిష్ఠతో చేయాలన్నారు. టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు పి.సీతారామాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీవై పార్టీ గడియారాల సీజ్

బిల్లులు చూపిన నేతలు.. పట్టించుకోని పోలీసులు


తిమ్మికృష్ణాపురంలో గోడగడియారాలను లారీలోకి ఎక్కిస్తున్న పోలీసులు

పుంగనూరు, ఫిబ్రవరి 6: పుంగనూరులోని రెండు చోట్ల బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్‌కు సంబంధించిన భారీ స్థాయిలో గోడ గడియారాలను పోలీసులు సీజ్ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పోలీసు బలగాలు మంగళవారం పుంగనూరుకు చేరుకున్నాయి. పలమనేరు ఇన్‌చార్జి డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి సెర్చ్ వారెంట్ ఉత్తర్వులతో ఏకకాలంలో రెండు చోట్ల సోదాలు నిర్వహించారు. కొత్తయిండ్లులోని ఎల్ఐసీ కాలనీలో రామచంద్రయాదవ్ భద్రతా సిబ్బంది సీఆర్పీఎఫ్ పోలీసులున్న ఇంటికి స్థానిక పోలీసులు వెళ్లారు. తలుపులు కొట్టి తీయమని చెప్పగా.. సీఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు నిరాకరించారు. తమ వద్ద సెర్చ్ వారెంటు ఉందంటూ పుంగనూరు, పలమనేరు సీఐలు రాఘవరెడ్డి, చంద్రశేఖర్, ఎస్ఐ సహదేవి హెచ్చరించారు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగింది. ఇంటి చుట్టూ పోలీసులు మోహరించి, ప్రధాన మార్గం గుండా లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. మీరు సహకరించకపోతే అరెస్ట్ చేస్తామని సీఐ రాఘవరెడ్డి చెప్పారు. ఆ తర్వాత లోపలకు వెళ్లిన పోలీసులు రామచంద్రయాదవ్ ఫొటో, చెరకు రైతు గుర్తుకే మన ఓటు అని ఉన్న గోడగడియరాల బాక్సులను పరిశీలించారు. వీటిని వాహనాల్లో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాత్రి 8 గంటల వరకు పోలీసులు పంచనామా నిర్వహించారు. అదే సమయంలో మండలంలోని చదళ్ల సమీపం.. తిమ్మికృష్ణాపురంలో శివకుమార్ ఇంటి వద్ద చౌడేపల్లె, గంగవరం సీఐలు కృష్ణారెడ్డి, చిన్న గోవిందు, సదుం ఎస్ఐ మారుతి సోదాలు నిర్వహించారు. ఇంటి సమీపంలోని గదిలో ఉన్న గోడ గడియారాలను రెండు లారీల్లో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, వీటిని వాహనాల్లోకి ఎక్కించడానికి కూలీలు లేకపోవడంతో పోలీసులే మోసుకెళ్లారు. చౌడేపల్లె సీఐ అయితే లారీ ఎక్కి బాక్సులను సర్ది పెట్టించారు. హైదరాబాదులో పద్మావతి సేల్స్ కార్పొరేషన్ నుంచి ఈ నెల 5వ తేదీ 6864 గోడగడియారాలు కొనుగోలు, జీఎస్టీ, ఇతరుల పన్నులు కలిపి రూ.5,26,469చెల్లించి పుంగనూరుకు తీసుకొచ్చినట్లు బీసీవై పార్టీ నేతలు పోలీసులకు బిల్లులను చూపారు. కాగా, ఓటర్లను ప్రభావితం చేసేందుకు గోడగడియారాలు తెప్పించారని పోలీసులు సోదాలు చేసేందుకు సెర్చ్ వారెంటు జారీ అయింది.

పెద్దిరెడ్డి రాజకీయ లబ్ధి కోసం..

మంత్రి పెద్దిరెడ్డి రాజకీయ లబ్ధి కోసం కొందరు పోలీసులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ రామచంద్రయాదవ్ మీడియాకు వీడియో పంపారు. సభ్యత్వ నమోదు డ్రైవ్‌లో పాల్గొన్న తమ పార్టీ కార్యకర్తలకు కిట్లు ఇవ్వడానికి రశీదులతో గోడగడియారాలు తెప్పిస్తే.. తప్పుడు ఆరోపణలతో వాటిని సీజ్ చేయడం దారుణమన్నారు. వీటిపై తాను న్యాయపోరాటం చేస్తానని చెప్పారు.

దేశంలో శాస్త్రవేత్తల కొరత

అధిగమించడానికి సైన్స్ టీచర్లు కృషి చేయాలి

ఐసర్ రిజిస్ట్రార్ విజయమోహనన్ పిళ్ళై


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నారాయణరావు, విజయమోహనన్ పిళ్ళై తదితరులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 6: దేశంలో శాస్త్రవేత్తల కొరత ఉందని, దీన్ని అధిగమించడానికి సైన్స్ టీచర్లు కృషి చేయాలని తిరుపతికి చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.విజయమోహనన్ పిళ్ళై సూచించారు. తిరుపతిలోని భారతీయ విద్యాభవన్స్‌లో సైన్స్ టీచర్లకు నిర్వహించిన రెండ్రోజుల ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ని ఐఎస్‌టీఏఫ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ డి.నారాయణరావు, డాక్టర్ టి.నారాయణరావు, రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ప్రతినిధి కరిమా అంజుమ్, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. పాఠశాల దశ నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచి, భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సాహించాలని చెప్పారు. ఐఎస్‌టీఏఫ్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధిలో సైన్స్ అండ్ టెక్నాలజీ ఎంతో కీలకమన్నారు. విద్యార్థులు, టీచర్లలలో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించాలన్న లక్ష్యంతో ఐఎస్‌టీఏఫ్ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని వివరించారు. ఆర్ఎస్‌సీ ప్రతినిధి కరిమా అంజుమ్ మాట్లాడుతూ టీచర్లు తమసామర్థ్యాలను పెంచుకునేందుకు శాస్త్రీయ పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాసైన్స్ అధికారి భానుప్రసాద్ మాట్లాడుతూ.. ఇటువంటి శిక్షణల ద్వారా బోధనా నైపుణ్యాలను సైన్స్ టీచర్లు పెంచుకోవాలని సూచించారు. బీవీబీ డైరెక్టర్ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

'రిపబ్లిక్ డే'లో తిరుపతి ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ

ఈక్వెస్ట్రియన్‌లో బంగారు పతకం ● జూనియర్ విభాగంలో బెస్ట్‌ఆర్మీ క్యాడెట్ అవార్డు



ప్రధాని మోదీ చేతులమీదుగా లాఠీని అందుకుంటున్న ఎడిఫై స్కూల్ విద్యార్థి శ్రీకాంత్ - తిరుపతి గ్రూపునకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు, శిక్షణ బృందం

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 6: న్యూఢిల్లీలో గతనెల26వ తేదీన జరిగిన గణతంత్ర దినోత్సవంలో తిరుపతి గ్రూపునకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు అద్భుత ప్రదర్శన ఇచ్చి, బంగారు, కాంస్య పతకాలను సాధించారు. ఈ మేరకు 29 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ మనీష్ అస్థాన పేర్కొన్నారు. తిరుపతిగ్రూపులోని పలుయూనిట్లకు చెందిన 10మంది క్యాడెట్లు అన్ని కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభచాటారని తెలిపారు. ఈక్వెస్ట్రియన్ ఈవెంట్‌లో జి.లోహిత్, చిత్రేష్ రావు అద్భుత ప్రదర్శనతో జాతీయస్థాయిలో బంగారు పతకాన్ని సాధించగా.. బెస్ట్ ఎయిర్ క్యాడెట్ విభాగంలో ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్‌కి చెందిన క్యాడెట్ తరుణ్‌తేజ కాంస్య పతకాన్ని పొందారని వివరించారు. జూనియర్ విభాగంలో ఎస్.శ్రీకాంత్.. బెస్ట్ ఆర్మీ క్యాడెట్ అవార్డు సాధించి చరిత్ర సృష్టించారన్నారు. శ్రీకాంత్‌కి ప్రధాని నరేంద్రమోదీ వ్యక్తిగతంగా గౌరవపతకం, లాఠీని అందజేసి అభినందించారన్నారు. తిరుపతి ఎన్‌సీసీ గ్రూపు చరిత్రలో ఇటువంటి బహుమతి అందుకోవడం ఇదేతొలిసారి అని, దక్షిణభారతస్థాయిలోనూ బెస్ట్ ఆర్మీ క్యాడెట్ అవార్డు రావడం సంతోషంగా ఉందని తెలియజేశారు. కాగా.. శ్రీకాంత్ తిరుచానూరులోని ఎడిఫై ఇంటర్నేషనల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతూ.. ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆఫ్ ఏపీ, తెలంగాణ ఆధ్వర్యంలో రెండేళ్లుగా శిక్షణ పొందుతున్నాడు. ఈవిద్యార్థి 2023సెప్టెంబరులో నిర్వహించిన ఆలిండియా థాల్‌సేన క్యాంప్‌లో జాతీయస్థాయిలో బంగారు, కాంస్య పతకాలు సాధించాడు. ప్రతిభ చూపిన వారిని మనీష్ అస్థానతోపాటు తిరుపతిఎన్‌సీసీ గ్రూపు కమాండర్ కల్నల్ యోగేష్ డుంగరకోటి, ఎడిఫైస్కూల్ యాజమాన్యం, టీచర్లు అభినందించారు.

ఆర్టీసీ బస్సు బోల్తా: 27 మందికి గాయాలు


బోల్తా పడ్డ బస్సు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 6: ఆర్టీసీ బస్సు బోల్తా పడటంతో 27 మంది ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు డిపోకు చెందిన బస్సు తిరువణ్ణామలై నుంచి తిరుమలకు వెళుతోంది. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో తిరుపతి రూరల్ మండలంలోని వేదాంతపురం సర్కిల్ - రామానుజపల్లె సర్కిల్‌కు మధ్య జాతీయ రహదారిపై వెళుతుండగా ఎదురుగా టిప్పర్ వచ్చింది. దీంతో వాహనాన్ని బస్సు డ్రైవర్ అదుపు చేయబోతుండగా రోడ్డుపక్కకు బోల్తా పడింది. బస్సులో 42మంది ప్రయాణికులు ఉండగా, 27మందికి గాయాలయ్యాయి. బాధితులను 108 అంబులెన్స్‌లో రుయాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని మాత్రం స్విమ్స్‌కు తీసుకెళ్లారు. బాధితుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు (భార్యభర్తలు, ముగ్గురు చిన్నారులు) ఉన్నారు. స్వల్ప గాయాలైన వారంతా మంగళవారమే డిశ్చార్జ్ కాగా, ఐదుగురు మాత్రమే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరు వాహనాల డ్రైవర్లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు తిరుపతి రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు.



గాయపడ్డ వారిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు - సంఘటనా స్థలంలో ప్రయాణికులు

నిష్పాక్షికంగా ఎన్నికల నిర్వహణ : కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిష్పాకికంగా ఎన్నికలు నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మీశ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలతో కలిసి ఓటర్ల జాబితా అభ్యంతరాలపై, ఎన్నికల సన్నద్ధతపై సమావేశం నిర్వహించారు. ఓటర్ల తొలగింపులు ఒక నియోజకవర్గంలో 0.1శాతం మించి ఉంటే సీఈవో అనుమతి తీసుకోవడం తప్పనిసరి అన్నారు. స్వీప్ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా ఈవీఎం డెమాన్‌స్ట్రేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ సెంటరుగా మహిళా విశ్వవిద్యాలయం పరిశీలనలో ఉందని తెలిపారు. రాజకీయపార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీఆర్వో పెంచలకిషోర్, ఈఆర్వో అదితిసింగ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పులివర్తి సుధారెడ్డి, మనోహర్, పురుషోత్తంనాయుడు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పొరబాట్లు లేకుండా విధులు నిర్వహించాలి

బీఎల్వో నుంచి పైస్థాయి అధికారి వరకు పొరబాట్లకు తావు లేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం రాత్రి జిల్లాలోని మండల స్థాయి అధికారులకు ఎన్నికల సన్నద్ధతపై వర్చువల్ విధానంలో దిశానిర్దేశం చేశారు.

నేడు 'శ్రీవేంకటేశ్వర నవరత్న మాలిక'

తిరుమల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని కల్యాణవేదికలో బుధవారం 'శ్రీవేంకటేశ్వర నవరత్న మాలిక' గోష్ఠిగానం జరగనుంది. రాత్రి ఏడు గంటలకు దాదాపు 300 మంది సుప్రసిద్ధ కళాకారులు గోష్ఠిగానం చేయనున్నారు. అలాగే కర్ణాటక సంగీత పితామహులు పురందరదాసు ఆరాధన మహోత్సవాలు టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గురువారం నుంచి శనివారం వరకు తిరుమలలో ఆస్థానమండపంలో జరగనున్నాయి.

చంద్రగిరిలో దొంగ ఓట్లను ఏరేయండి

కలెక్టర్‌కు టీడీపీ నాయకురాలి ఫిర్యాదు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లను ఏరేయండని టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ లక్ష్మీశను కలిసి ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఓటమి భయంతోనే చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి.. దొంగ ఓట్లు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. ఏడు నెలలుగా ప్రాణాలు పణంగా పెట్టి, పోరాటం చేయడంతో 22వేల ఓట్లు రిజెక్టు చేశారన్నారు. మళ్లీ వేల సంఖ్యలో దరఖాస్తులు పుట్టుకువస్తున్నాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా ఒక్కో వ్యక్తికి నాలుగు ఓట్లు గుర్తించామని చెప్పారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి 2024 జనవరి 22వ తేదీవరకు 1,27,406 మంది ఓట్ల కోసం దరఖాస్తుచేయగా 44,826 ఓట్లను రిజెక్టు చేశారన్నారు. 78,018 ఓట్లు ఆమోదించారని, ఇంకా 4,562 పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈ స్థాయిలో ఓట్లు ఆమోదించడంతో రాష్ట్ర చరిత్రలో చంద్రగిరి మొదటిస్థానంలో నిలిచిందని మండిపడ్డారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

'పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్' కార్యవర్గం



తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 6: ది పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటైంది. మంగళవారం జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.అర్జునయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీ పరిచయ కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి ద్వారా ప్రతినిధులకు నియామక పత్రాలను అందజేశారు. జిల్లా అధ్యక్షుడిగా ఐ.బాబు, కార్యదర్శిగా జి.నరసింహులు, చైర్మన్‌గా ఎస్.అల్లయ్య, ట్రెజరర్‌గా పరమేశ్వర, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాంబాబు ఎన్నికయ్యారు. డిప్యూటీ సీఎంఈ నరసింహులు, డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, ఏటీఎం సురేంద్రబాబు, డీఎం భాస్కర్, సంఘం రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షురాలు ఇ.లతారెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.టీ.ఆర్.రెడ్డి, జి.వి.ముని, రాష్ట్ర కార్యదర్శులు మురళీధరన్, రమణరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 6: తిరుపతి రైల్వేస్టేషన్‌లో మంగళవారం పోలీసు, భద్రతా సిబ్బంది సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ సీఐ మధుసూదన్ మాట్లాడుతూ.. విలువైన వస్తువులతో ప్రయాణించవద్దని సూచించారు. ఎన్నికల సందర్భంగా కరెన్సీ నోట్లు, ఇతర నిషేధ వస్తువులతో ప్రయాణిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హేమసుందర్, ధర్మేంద్రరాజు, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వేడుకగా ఏకాదశి ఉత్సవాలు



నారాయణవనం, ఫిబ్రవరి 6: మండలంలోని పద్మావతీ సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో మంగళవారం ఏకాదశి ఉత్సవాలు వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య పూజా కైంకర్యాలు చేపట్టారు. ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తుల దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం పద్మావతీ సమేత కల్యాణ వెంకన్న ఊరేగింపు, మాడవీధుల్లో ఊరేగించారు. భక్తుల నారీకేలా, కర్పూర నీరజానాలు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 6: హిమజ డిగ్రీ కళాశాలలో మంగళవారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ లోకనాథం ఆధ్వర్యంలో సెట్విన్ అధికారి మోహన్‌కుమార్ పర్సనాలిటీ డెవల్మంట్, స్టడీ స్కిల్స్ కెరీర్ కౌన్సిలింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అర్థమెటిక్, లాజికల్ రీజనింగ్, ఆంగ్లంపై పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కౌటిల్య సంస్థ మేనేజర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పురుషోత్తంరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పల్లెకు పోదాంను విజయవంతం చేద్దాం: బీజేపీ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 6: ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలు, సంక్షేమ, అభివృద్ధి పథకాలపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం కల్పించాలనే లక్ష్యంతో ప్రారంభిస్తున్న 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ చేరువయ్యేలా ప్రచారం కల్పించాలన్నారు. అనంతరం పార్టీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, మునస్వామి, మధు, హరి, చక్రపాణిరెడ్డి, రాజేంద్ర, గోపి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేట తహసీల్దారుగా రాజసింహ



వడమాలపేట, ఫిబ్రవరి 6: వడమాలపేట తహసీల్దార్‌గా రాజసింహ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం కడప జిల్లా కమలాపురానికి బదిలీ అయ్యారు. కడప జిల్లా నుంచి రాజసింహ వడమాలపేటకు వచ్చారు. కొత్త తహసీల్దారుకు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.69 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.69 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం లెక్కించి మంగళవారం ప్రకటించింది.

విద్యార్థుల వసతులపై దృష్టి పెట్టండి


విద్యాశాఖాధికారులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ సుమన్ కుమార్

నారాయణవనం, ఫిబ్రవరి 6: రానున్న పరీక్షా కాలంలో విద్యార్థులకు అవసరమైన వసతులపై దృష్టి పెట్టాలని జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఎంఈవోలు ప్రభాకర రాజు, గోవిందస్వామితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్‌కుమార్ మాట్లాడుతూ రానున్న వేసవిలో విద్యార్థులకు తాగునీరు కొరత లేకుండా చూడాలన్నారు. నాడు-నేడు పనుల తీరు, మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేలా విద్యను అందించాలని ఆయన తెలిపారు.

రా.. కదలిరా.. సభకు తరలిన టీడీపీ శ్రేణులు


చంద్రబాబు సభకు బయల్దేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

వడమాలపేట, ఫిబ్రవరి 6: గంగాధర నెల్లూరులో మంగళవారం జరిగిన రా.. కదలిరా... బహిరంగ సభకు వడమాలపేట మండలం నుంచి టీడీపీ నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. నగరి ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో పలు వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.



హారతులు సమర్పిస్తున్న ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్

వైభవంగా కాలభైరవ స్వామి ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిలో శుద్ధి, అభిషేకాలు ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. కాలభైరవుడి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం మీదుగా విజయ స్తూపం వరకు వెళ్ళి అక్కడి నుంచి ప్రదక్షిణ చేసి తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లైబ్రేరియన్ పోస్టుకు ఇంటర్వ్యూ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6: స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గెస్ట్ లైబ్రేరియన్ పోస్టుకు ఈనెల 9న ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలత మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. ఒక గెస్టు లైబ్రేరియన్ పోస్టుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో ఉదయం 10గంటలకు హాజరు కావాలని తెలిపారు.

జీపాళెం పంచాయతీలో జనసేన ఇంటింటి ప్రచారం

రేణిగుంట,ఫిబ్రవరి6: మండలంలోని జీపాళెం పంచాయతీ పరిధిలోని పలు పలు గ్రామాల్లో మంగళవారం శ్రీకాళహస్తీ నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ కోటా వినుత ఇంటింటి ప్రచారం చేశారు. ఇందులో భాగంగా కుర్రకాల్వ,పద్మానగర్, అడుసుపాళెం, దళితవాడల్లో ప్రచారాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, బాలాజీ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పులికుండ్రంలో రెండో దశ ఆరోగ్య సురక్ష

పిచ్చాటూరు, ఫిబ్రవరి 6: మండలంలోని పులింకుండ్రంలో రెండో దశ ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం వైద్యాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేస్తూ శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారికి కార్పొరేట్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. అలాగే పులికుండ్రం జడ్పీ హైస్కూలు విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లను స్థానిక ప్రజాప్రతినిధులు అందించారు కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు చలపతిరాజు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌నాయుడు, ఎంఈవో యుగంధర్‌రాజు, సర్పంచ్ సతీష్‌రాజు, ఎంపీటీసీలు రమేష్‌రాజు, శోభన్‌బాబు, నాయకులు తొప్పయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు

చేపల చెరువుకు వేలంపాట

ఏర్పేడు, ఫిబ్రవరి 5: మండలంలోని ఎండీపుత్తూరు గ్రామంలోని చేపల చెరువుకు వేలం పాట మంగళవారం నిర్వహించారు. గ్రామానికిచెందిన మురళీ ఆచారి రూ.33,500కు వేలం పాట దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా సర్పంచ్ మోహనప్రియ మాట్లాడుతూ చెరువు పాడుకున్న వారుచెరువు కింద సాగుబడి చేసుకుంటున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చెరువులో చేపలను పట్టుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి లోకముని, వీఆర్వో రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఏర్పేడు, ఫిబ్రవరి 6: మండలంలోని నచ్చనేరి పంచాయతీ దుర్గిపేరి గ్రామ స్మశాన వాటిక సమీపంలో గుర్తు తెలియనివ్యక్తి(50) ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. స్థానిక పశువుల కాపర్లు పోలీసులుకు సమాచారం అందించడంతో ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు, ఎస్ఐ జిలాని, ఏఎస్ఐ జగన్‌మోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు స్థానికుడు కాకపోవడంతో మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఏర్పేడు సీఐ, ఎస్ఐలకు సమాచారం ఇవ్వాలని కోరారు. మృతుడి శరీరంపై ఎలాంటి దుస్తులు లేకుండా కేవలం డ్రాయర్‌తో అనుమానాస్పదస్థితిలో మృతి చెంది ఉన్నట్లు గుర్తించామని సీఐ తెలిపారు.

వరకట్న వేధింపుల కేసులో ఇద్దరికి రిమాండ్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6: వరకట్న వేధింపుల కేసులో ఇద్దరిని రిమాండ్ కి తరలించారు. శ్రీకాళహస్తి మండలం ఇసుగుంటకు చెందిన ఆరు నెలల గర్భవతి జాస్మిన్ ఐదు రోజుల క్రితం అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. వివాహమై ఏడు సంవత్సరాలు పూర్తి కాకపోవడంతో వరకట్న వేధింపుల సెక్షన్ కింద శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా మృతురాలి భర్త అమీర్ సోహైల్, అతని తల్లి షేక్ ఖాదర్ బీని పోలీసులు అరెస్టు చేసి, మంగళవారం రిమాండ్ కు తరలించారు.

నూతన ఎస్ఐకి సత్కారం

రేణిగుంట,ఫిబ్రవరి6: అర్బన్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డిని మంగళవారం పంచాయతీ సర్పంచ్ ఆర్.నగేషం అద్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇర్ఫాన్, ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు పాల్గొన్నారు.

ఆలయ ఉద్యోగి ఆకస్మిక మృతి



ప్రేమేశ్వర్ రావు (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6: ముక్కంటి ఆలయ ఒప్పంద ఉద్యోగి ప్రేమేశ్వరరావు(45) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధికి చెందిన ప్రేమేరేశ్వరరావు ఆలయంలో పని చేస్తుంటాడు. ఇటీవల రెండు వారాల క్రితం ఆయన తండ్రి మరణించడంతో ఆదివారం కర్మకిర్రియలు నిర్వహించారు. అనంతరం మంగళవారం సొంత పనుల నిమిత్తం కారులో తిరుపతికి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా పట్టణ శివారులోని మిట్టకండ్రిగ వద్ద ఛాతి నొప్పిగా ఉందంటూ కొందరు మిత్రులకు సమాచారం అందించాడు. తరువాత స్నేహితులు అక్కడికి చేరుకొని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆలయ అధికారలు, సహచర ఉద్యోగులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

చెరువుగుంట కబ్జా యత్నం



చెరువుగుంట కబ్జాచేయడానికి ప్రయత్నిస్తున్న దృశ్యం

తొట్టంబేడు, ఫిబ్రవరి 6: శ్రీకాళహస్తి మండలంలోని చల్లపాళెం రెవెన్యూ సర్వేనెం 307-3లో కొందరు వైసీపీ నాయకులు చెరువు పూడ్చి కబ్జాకు ప్రతిస్తున్నారని సామాజికమాధ్యమాల్లో వైరల్ అయింది. రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు పిర్యాదు చేయటంతో స్పందించిన రెవెన్యూ అధికారులు గ్రామస్తులతో కలిసి అడ్డుకోవడంతో కబ్జారాయుళ్ల వెనుదిగారు. దీనిపై రెవెన్యూ అధికారుల వివరణ కోరగా చెరువు గుంటలో సూచిక బోర్డు ఏర్పాటు చేస్తున్నామని మరల ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అడ్డుకున్న గ్రామస్తులు రెవెన్యూ అధికారులు

శ్రీకాళహస్తి

సత్యవేడు

పార్టీల్లో నిస్తేజం....
శ్రేణుల్లో గందరగోళం

సత్యవేడు పాలిటిక్స్

సత్యవేడు, ఫిబ్రవరి 3: నియోజకవర్గ రాజకీయ చరిత్రలో ప్రధాన రాజకీయ పార్టీల్లో మునుపెన్నడూ లేనివిధంగా విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీలూ సైతం నిస్తేజంగా ఉన్నట్లు కనిపిస్తోంది. దీంతో ఆయా పార్టీల్లో శ్రేణులు గందరగోళానికి గురవుతున్నారు. ప్రధానంగా వైసీపీలో తెరమీదకొచ్చిన స్థానిక నినాదంతో ఆ పార్టీ కేడర్ మొత్తం నైరాశ్యంలో కూరుకుపోయినట్లుంది. సత్యవేడు అభ్యర్థిగా నియమించిన గురుమూర్తిని మార్చి కొత్త అభ్యర్థి గా నూకతోటి రాజేష్‌ను ప్రకటించడంతో ఆపార్టీ నాయకు ల్లో అసహనం పెరిగింది. అధిష్ఠానం తీరుకు నిరసనగా సోషల్ మీడియాలో అసంతృప్తి వ్యక్తంచేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆపార్టీలోని దళిత సామాజిక వర్గంలో పుట్టుకొచ్చిన స్థానిక నినాదం రోజురోజుకు బలపడుతూ టికెట్ ఆశిస్తున్న స్థానిక ఆశావహుల సంఖ్య 50కి దాటింది. కొందరు ఆశావహులు మాత్రం తమకే టికెట్ వస్తుందని, మద్దతివ్వాలంటూ నియోజకవర్గంలో తిరుగు తూ రహస్యంగా మంతనాలు జరుపుతున్నట్లు సమాచా రం. దీంతో నియోజకవర్గంలో వైసీపీలోని అగ్రశేణి నాయకులు ఎలా స్పందించాలో పాలుపోక మౌనం దాల్చారు. ఈ పరిణామాలతో నియోజకవర్గంలో ఆ పార్టీ అలికిడి లేకుండా నిస్తేజంగా ఉన్నట్లు అనిపిస్తోంది. అయితే ఈ రాజకీయ పరిణామాలను తమకు అనుకూలంగా మలుచుకోవాల్సిన టీడీపీ సైతం చడీచప్పుడు లేకుండా ఉంది. గత వారం రోజుల నుంచి నియోజకవర్గంలో ఆశించిన స్థాయి లో పార్టీ కార్యక్రమాలు నిర్వహించడంలేదు. ఎలాగైనా టికెట్ సాధించాలని దృష్టిపెట్టిన నేతలు పార్టీ కార్యక్రమాల వైపు తొంగిచూడక పోవడంతో టీడీపీ కేడర్‌లో సైతం ఒక రకమైన నిరాశ కనిపిస్తున్నట్లు ఉంది. ఎవరికి వారు తమ కే టికెట్ అని చెప్పుకుంటూ చేస్తున్న బహిరంగ, రహస్య పర్యటనలతో శ్రేణులు గందరగోళానికి గురవుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సత్యవేడు, ఫిబ్రవరి 6: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సత్యవేడు మండలంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ వీరాంజనేయులు తెలిపిన వివరాల మేరకు... కొత్తమారికుప్పం పంచాయతీ కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన శ్రీనివాసుల రెడ్డి ద్విచక్రవాహనంపై రాత్రి 10 గంటల సమయంలో శ్రీసిటీ వైపు వెళ్తున్న సమయంలో పాలగుంట సమీపంలో లారీ ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసులురెడ్డి రోడ్డుపై పడిపోయాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించే లోపు శ్రీనివాసులురెడ్డి మృతి చెందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా మృతి చెందిన శ్రీనివాసులు రెడ్డి శ్రీసిటీలో క్యాంటిన్ నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

వెంకయ్యకు ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6: పద్మ విభూషణ్, మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. శ్రీకాళహస్తి కి చెందిన కోలా ఆనంద్ మంగళవారం డిల్లీలో వెంకయ్య నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. పద్మ విభూషణ్ అవార్డు రావడంపై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముక్కంటి ఆలయ శేష వస్త్రంతో సత్కరించి, తీర్ధ ప్రసాదాలను అందజేశారు.

నైపుణ్యంతోనే పురోభివృద్ధి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6: నైపుణ్యంతోనే పురోభివృద్ధి సాధ్యమని శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని కళాశాలలో మంగళవారం బెంగళూరుకు చెందిన జాయిన్ ద డాట్స్ సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధిపై ఉచిత శిక్షణ కోసం ముందుగా విద్యార్థులకు అర్హత పరీక్ష నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాది పాటు ఉచితంగా నైపుణ్య అభివృద్ధి శిక్షణ పూర్తయిన తర్వాత ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఫౌండేషన్ అధ్యక్షుడు ధనుంజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దినదయాల్, జెకెసి కోఆర్డినేటర్ డాక్టర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ మెకానిక్ ఆత్మహత్య

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6: ట్రాక్టర్ మెకానిక్ గా పని చేసే ముని కుమార్ (25)ఉరి వేసుకుని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రాజెక్టు వీధికి చెందిన మునికుమార్ పట్టణ శివారు చెన్నై రోడ్ లోని ట్రాక్టర్ షోరూంలో మెకానిక్‌గా పనిచేసేవాడు. మనస్తాపంతో మంగళవారం ఇంటి వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాళహస్తి 1టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం అనంతరం తిరిగి బంధువులకు అప్పగించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 6: విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలని బత్తులవల్లం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరమేశ్వరయ్య అన్నారు. మండలంలోని బత్తులవల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొండిలైజ్ సహకారంతో 6, 7, 8వ తరగతి విద్యార్థులకు మంగళవారం కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, స్పోర్ట్స్ డ్రెస్సులు అం దజేశారు.

టీడీపీలో చేరిన హమాలీలు



సుధీర్ రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన హమాలీలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6: సుమారు 110 మంది ఏపీ సీడ్స్ హమాలీలు టీడీపీలో చేరారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు లోని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి స్వగృహంలో వద్ద ఏపీ సీడ్స్ యూనియన్ సభ్యులు కలిశారు. సుధీర్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు మునయ్య, ఈశ్వర్‌రెడ్డి హరిబాబు, మోహన్‌రెడ్డి, ముని కృష్ణారెడ్డి వెంకటేష్, చంగల్ రాయలు, వరమ్మ, రమణమ్మ, చంద్రమ్మ, రాధమ్మ, జ్యోతి, భారతి, సరోజినమ్మ, లక్ష్మి, కామాక్షి, అనసూయ తదితరులు టీడీపీలో చేరారు.

ముక్కంటి ఆలయ పైకప్పు లీకేజీ నియంత్రణకు శ్రీకారం



లీకేజీల నియంత్రణపై చైర్మన్‌తో చర్చిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6: ముక్కంటి ఆలయం పై కప్పులో లీకేజీలను నియంత్రించే పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తెలిపారు. ఈమేరకు మంగళవారం పూణేకు చెందిన నిపుణుల బృందం ఆలయ పైకప్పును పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ... పూణే కు చెందిన ఉత్తరాదేవి చారిటబుల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ అధినేత వెంకటేశ్వరరావు రూ.3.60 కోట్లతో లీకేజీల నియంత్రణ పనులు చేస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ బొమ్మ మార్పునకు కసరత్తు

శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని ఊరేగింపు వాహన మండపం వద్ద ఉన్న గాంధీ బొమ్మ మార్పుపై మంగళవారం అధికారులు కసరత్తు చేశారు. ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఆలయ ఇంజనీరింగ్ శాఖ అధికారులు గాంధీ బొమ్మ మార్చేందుకు స్థల పరిశీలన చేశారు. ఉత్సవాల్లో వాహన మండపానికి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిధులతో సమీపంలో గాంధీ బొమ్మ ఏర్పాటు చేయనున్నట్లు అంజూరు శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈ శివకుమార్, మున్సిపల్ డిఈ లలిత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ శేఖర్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6: జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతానికి ప్రధానోపాధ్యాయులు, పీడీలు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో డాక్టర్ శేఖర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్బీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లోని ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈనెల 10,11 తేదీల్లో రెండు రోజులపాటు శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్బీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ విజయవంతానికి అవసరమైన కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ భాను ప్రసాద్, సీఎంఓ సురేష్, ఎంఈఓ లు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే మహిళా సాధికారత



భరతమాత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళా మోర్చా సభ్యులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6: బీజేపీతోనే మహిళా సాధికారత సాధ్యమని ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సోము వేదవతి అన్నారు. పట్టణంలోని ఆమె స్వగృహంలో మంగళవారం శక్తివందన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా మోర్చా కార్యవర్గ సమావేశం జరిగింది. ముందుగా భరతమాత చిత్రపటానికి పూలమాలతో వందనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



తొట్టంబేడు, ఫిబ్రవరి 6: మండలంలోని జ్ఞానమ్మకండ్రిగ గ్రామంలో మంగళవారం మృతి చెందిన ఆదెమ్మ(90) భౌతికాయానికి జనసేన నియోజకవర్గ ఇంచార్జి కోటావినుత నివాళులర్పించారు. వారి కుటుంబానికి 5వేల రూపాయుల ఆర్థిక సహాయం అందజేశారు. వినుత దృష్టికి ఆదెమ్మ ఆర్థిక పరిస్థిని వివరించడంతో గత కొన్ని నెలలుగా ఆమె ప్రతి నెల నిత్యవసర సరుకులు అందిస్తోంది.

పూర్తి పరిహారం ఇచ్చేదాకా పొలాల్లో దిగనివ్వం

● అధికారులకు తెగేసి చెప్పిన చిందేపల్లి రైతులు

ఏర్పేడు, ఫిబ్రవరి 6: జగనన్న కాలనీ పేరిట రైతుల దగ్గర తీసుకున్న భూములకు ప్రభుత్వం పూర్తిగా పరిహారం ఇచ్చేంత వరకు పొలాల్లో ఎవరిని దిగనివ్వమని ఏర్పేడు మండల చిందేపల్లి రైతులు అధికారులతో తెగేసి చెప్పారు. ఏర్పడు మండలం చిందేపల్లె రెవెన్యూలో తిరుపతి పట్టణంలో నివసిస్తున్న పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం మొదటి విడతలో నాలుగేళ్ల క్రితం 250 ఎకరాలు తీసుకుంది. అందులో ఇంకా 11 ఎకరాలకు సంబంధించిన ఆరుగురు రైతులకు పూర్తి పరిహారం చెల్లించలేదు. అదే విధంగా రెండవ విడతలో 37.17 ఎకరాల భూమిని 14 మంది రైతుల నుంచి తీసుకున్నారు. అయితే ఈ 14మంది రైతులకు 37 ఎకరాలకు సంబంధించి సగం మొత్తం మాత్రమే చెల్లించారు. రికార్డులు సక్రమంగా లేవని సగం మొత్తాన్ని ఇవ్వకుం డా నాలుగేళ్లగా కాలయాపనచేశారు. పూర్తి పరిహారం ఇవ్వకపోవడంతో రైతులు ఆ భూమిలో ప్రస్తుతం వరి సాగు చేశారు. అయితే ఈ భూమిని చదును చేయడానికి సంబంధిత కాంట్రాక్టరు యంత్రాలతో మంగళవారం చిందేపల్లి గ్రామానికి వెళ్లాడు. సమా చారం తెలుసుకున్న చిందేపల్లి రైతులు పొలాల వద్దకు వెళ్లి తమకు పూర్తి పరిహారం ఇచ్చేదాక భూమిలో దిగడానికి వీలులేదని అడ్డుకున్నారు. ఈ విషయాన్ని కాంట్రాక్టరు ద్వారా తెలుసుకున్న ఏర్పేడు తహసీల్దారు ఉదయ్ భాస్కర్ రాజు చిందేపల్లి గ్రామానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. చిందేపల్లి రైతుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తహసీల్దారు రైతులకు హామీ ఇచ్చారు. అలాగే రైతులు తహసీల్దారుతో మాట్లాడుతూ చిందేపల్లి రైతుల వద్ద ఇళ్ల పట్టాల పేరిట భూసేకరణ సమయంలో ప్రతి రైతుకు ఇంటి పట్టా అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారని అంతే కాకుండా పొలాల్లో ఉన్న చెట్లకు, మోటార్లకు, బోర్లకు పరిహారాన్ని అందించి భూమిని తీసుకుంటామని హామీ ఇచ్చారని అయితే ఆ హామీలు ఏవి అధికారులు, ప్రభుత్వం నెరవేర్చలేదని చెప్పారు. రైతులకు పూర్తి పరిహారం ఇవ్వకుండానే రైతులపై దాడి చేయడానికి ప్రభుత్వం ప్రయత్నంచేయడం బాధాకరమని చిందేపల్లి రైతులు వాపోయారు. ప్రస్తుతం ఎకరాకు రూ.50వేలు అప్పు చేసి పంట వేశామని రైతులు తహసీల్దారుకు చెప్పారు. పంట చేతికొచ్చే సమయంలో చదును చేసి పట్టాలివ్వడం ఏమిటని ప్రశ్నించారు. రైతులకు పూర్తి పరిహారం ఇవ్వడంతో పాటు, పొలాల్లో ఉన్న చెట్లకు, మోటార్లకు పరిహారం ఇచ్చేవరకు పొలాన్ని వదలిపెట్టమని తెలిపారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.



ఎక్సకవేటర్‌తో పొలల్లో చెట్లను తొలగిస్తున్న దృశ్యం

టీడీపీని ఆదరించండి



రామానుజపల్లెలో టీడీపీ నాయకుల బైక్ ర్యాలీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6: వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రిషితారెడ్డి కోరారు. శ్రీకాళహస్తి మండలంలోని కుంటిపూడి, రామానుజపల్లె గ్రామాల్లో మంగళవారం టీడీపీ మేనిఫెస్టో పై ఇంటింటికి ప్రచారం చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి రంగనేని చెంచయ్య నాయుడు, యూనిట్ ఇంచార్జి రమేష్, సీనియర్ నాయకులు ఈశ్వర్ రెడ్డి, రాంబాబు నాయుడు, పాపిరెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, ప్రతాపరెడ్డి, రాఘవులు, శివ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలి



రా కదలిరా బహిరంగ సభకు తరలిన రామాంజుల నాయుడు తదితరులు

కేవీబీపురం ఫిబ్రవరి6: రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తున్న అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు రామాంజుల నాయుడు పిలుపునిచ్చారు. గుడిపాల మండల అబ్జర్వర్‌గా వ్యవహరిస్తున్న రామాంజులనాయుడు జి.డి.నెల్లూరులో జరిగే రా కదిలిరా బహిరంగ సభ విజయవంతానికి కృషి చేశారు. గుడిపాల మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, జనసేన నాయకులు, కార్యకర్తలు, కేవీబీపురం మండల నాయకులు గోపినాథ రెడ్డి, సురేష్ రెడ్డి, చంద్రయ్య నాయుడు, మునిశంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో హిమాచల్ మాజీ సీఎం



జైరాం సింగ్‌కు స్వాగతం పలుకుతున్న స్థానిక నేతలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6: శ్రీకాళహస్తీశ్వరుడిని మంగళవారం హిమాచల్ ప్రదేశ్ మాజీ సీఎం జైరాం సింగ్ ఠాగూర్ దర్శించుకున్నారు. స్థానిక బీజేపీ నాయకులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మ వార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు శేష వస్త్రాలతో సత్కరించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్ బాబు, దేవస్థానం ఏసి మల్లికార్జున్, పీఆర్వో సతీష్, నాగభూషణం నాయక్, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అమర్ నాథ్, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ఉమా సింగ్, వాసు యాదవ్, డిల్లీ కుమార్, వెంకటేశ్వర్లు , యువ మోర్చా అధ్యక్షుడు భరత్ నాయుడు, చందు, రాజ నరసింహ, నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలోని పదహారు కాళ్ల మండపంలో వెలసిన ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సింధూరం దిద్ది పుష్పాలతో అలంకరించారు.